జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాపాలన

6-2-29/3/12, 3వ అంతస్తు, దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004

వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 5 సంచిక 120 | హైదరాబాద్, ఫిబ్రవరి 20 ఆదివారం 2022 | 8 పేజీలు | వెల : 5.00




## సాంప్రదాయ పూజలతో...

# అమ్మవార్లకు ఘన వీడ్కోలు

## ముగిసిన మేడారం మహాజాతర.. వనంలోకి జన దేవతలు

మేడారం: మేడారం జాతర ముగిసింది. సమ్మక్క-సారక్క అమ్మవార్లు వన ప్రవేశం చేశారు. చివరిరోజు వనదేవతల దర్శనం కోసం పెద్ద సంఖ్యలో వచ్చారు భక్తులు. మేడారం సమ్మక్క-సారలమ్మ వనప్రవేశం వైభవంగా ముగిసింది. డప్పులు, డోలువాయిద్యాల మధ్య అమ్మవార్లను వనంలోకి తీసుకెళ్లారు పూజారులు. గద్దెలపై ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భారీ పోలీసు బందోబస్తు మధ్య అమ్మవార్లను వనప్రవేశానికి తీసుకెళ్లారు. గవర్నర్ తమిళిసై వనదేవతలను దర్శించుకున్నారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి పూజలు చేశారు. అమ్మవార్ల దీవెనలు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నాన న్నారు. తన రాక సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలిగితే క్షమించాలని కోరారు గవర్నర్. మేడారం జాతరకు జాతీయ పండుగగా కేంద్రం ప్రభుత్వం ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. జాతరకు నిధులు తీసుకు రావడంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫెయిల్ అయ్యారన్నారు. 8 ఏళ్లలో ప్రధాని మోడీ ఎందుకు మేడారం రాలేదన్నారు ఎర్రబెల్లి. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూశామన్నారు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి. సీఎం కేసీఆర్ మేడారం జాతరకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి. సమ్మక్క పోరాట స్ఫూర్తిని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని సీఎం కించపరిచారన్నారు. మేడారం సమ్మక-సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు రేవంత్. ములుగు జిల్లాకు సమ్మక్క-సారక్క పేరుపెట్టాలని డిమాండ్ చేశారాయన. ముచ్చింతల్ కు వచ్చిన ప్రధాని మోడీ మేడారం ఎందుకు రాలేదన్నారు. సీఎం, పీఎం కలిసి మేడారం జాతరను చిన్నగా చూపే కుట్ర చేస్తున్నారన్నారు. ఆదివాసీ, గిరిజన జాతరకు గవర్నర్ వచ్చినప్పుడు మంత్రులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే సీతక్క. ఉదయం మేడారంలోనే ఉన్న మంత్రులు.. గవర్నర్ వచ్చే వరకు ఎందుకు లేరని ప్రశ్నించారు. జాతరలో రాజకీయాలు సరికాదన్నారు. మేడారం జాతర నిర్వహణలో సక్సెస్ అయ్యామన్నారు ములుగు జిల్లా కలెక్టర్ క్రిష్ణాదిత్య, ఎస్పీ సంగ్రామ్ (మిగతా 5లో..)

# వెనక్కి తగ్గిన జగ్గారెడ్డి..!



హైదరాబాద్: అదిగో ఇదిగో అన్నారు. ఇవాళే గుడ్‌బై చెప్పేస్తానన్నారు. టైం కూడా ఫిక్స్ చేశారు. డెడ్‌లైన్ ముగిసే సమయానికి కాస్త వెనక్కి తగ్గారు. ఇప్పుడు కాదు రెండు, మూడు రోజుల్లో నిర్ణయిస్తానని చెప్పుకొచ్చారు. పైగా పార్టీలో అవమానం జరుగుతోందంటూ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీకి, ముఖ్యనేత రాహుల్‌గాంధీకి లేఖలు రాశారు. సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి తీరుతో కాంగ్రెస్‌లో సంక్షోభం నెలకొంది. అది ఇప్పట్లో సద్దుమణిగే పరిస్థితి కనపించడం లేదు. గతకొంతకాలంగా కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అవమానానికి గురవుతున్న జగ్గారెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తారన్న వార్తలు వచ్చాయి. తాజాగా లేఖతో సరిపెట్టారు జగ్గారెడ్డి.తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి టార్గెట్‌నే విమర్శలు, లేఖలు రాశారు జగ్గారెడ్డి. పార్టీలోకి సడన్‌గా వచ్చి లాబీయింగ్ చేస్తే ఎవరైనా పీసీసీ కావొచ్చన్నారు. అలాంటి తప్పు తాను చేయబోనన్నారు. తనపై కుట్ర పూరితంగానే కోవర్టు అన్న ఆరోపణలు చేస్తున్నారని, అయినా పార్టీ వ్యవస్థ వాటిని ఖండించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు జగ్గారెడ్డి. ఆర్థిక కష్టాలు ఉన్నా పార్టీ కోసమే పని చేశానని సోనియా, రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆరోపణలు పడే కంటే స్వతంత్రంగా (మిగతా 2లో..)

# తెలంగాణ బకాయిల సంగతేంటి..?

## కేంద్రానికి మంత్రి హరీశ్ రావు మరోసారి లేఖ..!

హైదరాబాద్: తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. రాష్ట్రానికి రావల్సిన నిధుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లను వెంటనే విడుదల చేయాలంటూ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు శనివారం మరోసారి లేఖ రాశారు. గతంలో చేసిన అభ్యర్థనలను ఈ లేఖలో గుర్తు చేశారు. ఇవే అంశాలతో ఈ ఏడాది జనవరి 24న లేఖ రాసిన విషయం తెలిసిందే..

**మంత్రి హరీశ్ రావు రాసిన లేఖలో పేర్కొన్న విజ్ఞప్తులు**



ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 94 (2) ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేటాయించిన నిధుల్లో రెండేండ్ల బకాయి రూ.900 కోట్లు ఇంకా విడుదల చేయాల్సి ఉంది. వీటిని విడుదల చేయడంతోపాటు గ్రాంట్‌ను 2021-22 తర్వాత ఐదేళ్లపాటు పొడిగించాలని మంత్రి హరీష్ కోరారు. నీతిఆయోగ్ సూచించిన మేరకు రూ.24,205 కోట్లు విడుదల చేయాల్సిందిగా విన్నవించారు.

స్థానిక సంస్థలకు రూ.817.61 కోట్లు (గ్రామీణ స్థానిక సంస్థలకు రూ. 315.32 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ. 502.29 కోట్లు) ఇవ్వాలన్న 14వ ఆర్థిక సంఘం సిఫారసులను కేంద్రం అకారణంగా తిరస్కరించింది. రాష్ట్రం అన్ని షరతులను పూర్తి చేసినప్పటికీ, నిర్దిష్ట కారణం లేకుండా ఈ గ్రాంట్లను తిరస్కరించారు. కాబట్టి వీటిని వీలైనంత త్వరగా విడుదలయ్యేలా చూడాలని హరీష్ రావు అభ్యర్థించారు.

2019-20తో (మిగతా 2లో..)

# చిక్కుల్లో పడ్డ అరవింద్ కేజ్రీవాల్..!



ఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, .ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చిక్కుల్లో పడ్డారు. ఆయనపై కేసు నమోదుచేయాలని పంజాబ్ ఎలక్షన్ కమిషన్ ఆదేశించింది. శిరోమణి అకాలీదళ్ ఫిర్యాదుపై స్పందించిన ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. కేజ్రీవాల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ఇతర పార్టీలపై తప్పుడు ఆరోపణలు చేశారని శిరోమణి అకాలీదళ్ ఫిర్యాదులో పేర్కొంది. ప్రజలకు తప్పుడు సందేశం ఇచ్చేలా రాజకీయ పార్టీల ఇమేజ్?ను దెబ్బతీసేలా ఆయన చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్?గా మారింది. ఆ వీడియోను రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లగా.. చర్యలు తీసుకోవాలని సాస్ నగర్ ఎస్పీని పంజాబ్ ఎన్నికల అధికారి ఆదేశించారు.

# బుందేల్‌ఖండ్‌పై మూడు పార్టీల కన్ను..

## పూర్వ వైభవం కోసం బీఎస్పీ 'మాయ'జాలం!




ఉత్తరప్రదేశ్ : ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అధికార పార్టీ భారతీయ జనతా పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఓటర్లను ఆకర్షించేందుకు తనదైన శైలిలో ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. మొన్నటి వరకు ఎన్నికల ప్రచారంలో 'కామ్ దుమ్దార్ యోగి సర్కార్' )అనే నినాదంతో బీజేపీ ముందుకుసాగింది. అయితే తాజాగా మారుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ నినాదం మార్చింది. యూపీ ఎన్నికల కోసం 'యూపీ మే ఫిర్ ఏక్ బార్ బీజేపీ సర్కార్ అనే నినాదంతో ముందుకు సాగుతోంది. ఇక అంతే ధీటుగా ప్రతిపక్ష పార్టీలు ప్రచారంలో జోష్ పెంచారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. బీజేపీకి చరమగీతం పాడాలని అన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి ఏడు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే రెండు దశల్లో పోలింగ్ జరుగగా, ఫిబ్రవరి 20న మూడో విడతలో ఏడు జిల్లాల్లో ఐదు జిల్లాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రాంతాల్లో పట్టుసారించేందుకు అన్నిపార్టీల అభ్యర్థులందరూ గట్టి ప్రయత్నాలు చేస్తుండంత.. యూపీ ఎన్నికల్లో కీలకమైన బుందేల్‌ఖండ్ కోసం పోరు తీవ్రమైంది. జలౌన్ ,ఝాన్సీలలో వరుస ర్యాలీలతో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దూసుకుపోతున్నారు.

# 2023 కాంగ్రెస్‌కు చివరి ఎన్నికలు..

## సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు!

మధ్యప్రదేశ్ : మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యులు దిగ్విజయ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2023లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్‌కు చివరి ఎన్నికలు అని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. దీని తర్వాత ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వరు. శనివారం రత్లాంలోని స్థానిక సర్క్యూట్ హౌస్‌లో జవరా కాంగ్రెస్ నేతలతో అనధికారికంగా చర్చించిన సందర్భంగా దిగ్విజయ్‌సింగ్ ఈ విషయం చెప్పారు. దిగ్విజయ సింగ్ పార్టీ కార్యకర్తలను జట్టుగా పని చేయమని సలహా ఇస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దిగ్విజయ్ సింగ్ రత్లాం బస సమయంలో సర్క్యూట్ హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వివిధ కాంగ్రెస్ (మిగతా 2లో..)




SNEHA CLUB — PAY BACK TO SOCIETY

SNEHA MACS

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676


H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# వెనక్కి తగ్గిన జగ్గారెడ్డి..!

(మొదటి పేజీ తరువాయి)

ఉండటం బెటరన్న నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భార్యనే నిలబెట్టానని, పోటీకి పెట్టని వారు కోవర్టులా? తాను కోవర్టునా అని లేఖలో ప్రశ్నించారు జగ్గారెడ్డి. రాహుల్ సభ కోసం కోట్లు ఖర్చు పెడితే కోవర్టు బిరుదు ఇస్తారా నిలదీశారు. తన పార్టీ పదవులకు రాజీనామా చేసి స్వతంత్రంగా ఉండాలని భావిస్తున్నానని, ఈ లేఖ విడుదల దగ్గరి నుంచి తాను కాంగ్రెస్ పార్టీ గుంపులో లేనని ప్రకటించారు. త్వరలో పదవులకు రాజీనామా చేస్తానని లేఖలో సోనియా, రాహుల్‌కు వివరించారు జగ్గారెడ్డి. ఇదిలావుంటే, అంతకు ముందు జగ్గారెడ్డి ఇవాళే రాజీనామా చేస్తారన్న ప్రచారం కాంగ్రెస్‌లో కలకలం రేపింది. దాంతో పార్టీ సీనియర్ నేతలు ఆయనకు ఫోన్ చేసి బుజ్జగించారు. వీహెచ్ స్వయంగా జగ్గారెడ్డి దగ్గరకు వెళ్లి మాట్లాడారు. కొన్ని రోజులు ఆగాలని సూచించారు. ఇవాళే రాజీనామా చేస్తారని ముందు ప్రచారం జరిగినా సీనియర్ల ఒత్తిడితో కొంత వెనక్కి తగ్గారు జగ్గారెడ్డి. అంతకు ముందు, రెండు, మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానన్నారు. తన వల్లే పార్టీకి నష్టం వస్తుందంటే తానే పక్కకు తప్పుకుంటానన్నారు జగ్గారెడ్డి. తనను పక్కన పెట్టడమే కాంగ్రెస్ మంచిదన్నారు జగ్గారెడ్డి. తన వల్లే ఇబ్బంది కలుగుతున్నప్పుడు పక్కన పెట్టేయాలని విజ్ఞప్తి చేశారు. తాను కోవర్ట్ అని ప్రచారం జరిగినా కనీసం ఖండించకపోవడం బాధాకరమన్నారు. ఈ అంశంపై గాంధీభవన్‌లో యుద్ధాలే జరిగాయన్నారు జగ్గారెడ్డి. 2017లో రాహుల్ గాంధీ సభ పెట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోతే.. కోట్ల రూపాయాలు ఖర్చు పెట్టి సభ నిర్వహించాను అని జగ్గారెడ్డి లేఖలో గుర్తు చేశారు. ఆ సభ నుండి రాష్ట్రంలో పార్టీ బలపడింది.. పార్టీ కోసం కష్టపడిన నేనా కోవర్టుని%ౌా% సభను నిర్వహించకుండా మౌనంగా ఉన్న నేతలా కోవర్టులు ? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. హైప్ కోసమే ఇలాంటి చేస్తున్నారన్న ఇతర పార్టీల ప్రచారాన్ని జగ్గారెడ్డి ఖండించారు. రేవంత్‌రెడ్డి ఇంటి దగ్గర పోలీసులు, మీడియా 10 గంటలు వెయిట్ చేస్తే హైప్ కోసమేనా అని ఎదురు ప్రశ్నించారు. మరోవైపు, రేవంత్‌ను బుజ్జగించేందుకు సీనియర్లు సీన్‌లోకి వచ్చారు. భట్టి విక్రమార్క ఆయనకు ఫోన్ చేసి మాట్లాడారు. కూర్చుని మాట్లాడుకుందామని, తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.

## తెలంగాణ మరణశయ్యపై ఉంది: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సుభాష్‌నగర్: దొరలు, దోపిడీదారుల పాలన వల్ల తెలంగాణ రాష్ట్రం మరణశయ్యపై ఉందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. శనివారం ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ త్యాగాలకు సిద్ధపడకపోతే బీసీలకు హక్కులు రావన్నారు. బీసీలతో పాటు మైనార్టీ సమాజం ప్రమాదంలో ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలన్నీ ఆధిపత్య కులాల చేతుల్లోనే ఉన్నాయన్నారు. తాను ఏ కులానికీ వ్యతిరేకం కాదని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 75 శాతం సంపద 10 శాతం మంది వద్ద ఉందని ముఖ్యమంత్రి కేసీఆరే అన్నారని ఆయన చెప్పారు. ఆ పది శాతం మంది దగ్గర ఉన్న సంపదను అందరికీ పంచడానికి కేసీఆర్‌ను ఎవరు ఆపారని ప్రశ్నించారు. బహుజన రాజ్యం వస్తే ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యాసంస్థలు కార్పొరేట్ సంస్థల కంటే దీటుగా అభివృద్ధి చేస్తామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

# తెలంగాణ బకాయిల సంగతేంటి..?

(మొదటి పేజీ తరువాయి)

పోల్చితే 2020-21లో రాష్ట్రానికి పన్నుల్లో వాటా తగ్గుతుందని ఈ మేరకు తెలంగాణకు రూ.723 కోట్ల ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలని 15వ ఆర్థిక సంఘం సూచించింది. ఆర్థిక సంఘం సిఫార్సులను గతంలో ఎప్పుడూ తిరస్కరించిన సందర్భాలు లేవు. కాబట్టి ఎలాంటి ఆలస్యం లేకుండా ఈ నిధులను మంజూరు చేయాలన్నారు మంత్రి.

రాష్ట్రంలో అమలు చేస్తున్న కేంద్ర ప్రాయోజిత పథకాలలో రాష్ట్రం ఏర్పడిన మొదటి సంవత్సరమైన 2014-15లో కేంద్రం వాటాను పొరబాటున తెలంగాణకు కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేశారు. దీంతో తెలంగాణకు రావాల్సిన రూ.495.20 కోట్లు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాయి. ఈ విషయాన్ని మేము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతోపాటు అకౌంటెంట్ జనరల్ దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ, ఇంకా తెలంగాణకు ఇంకా సర్దుబాటు చేయలేదు. కాబట్టి ఈ మొత్తాన్ని వెంటనే తెలంగాణకు విడుదల చేయవలసిందిగా కోరుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

వీటితోపాటు పెండింగ్ లో ఉన్న ఐజీఎస్టీ నిధులు రూ.210 కోట్లను కూడా సర్దుబాటు చేయాల్సిందిగా రాష్ట్ర మంత్రి హరీష్ రావు.. కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## బుందేల్‌ఖండ్‌పై మూడు పార్టీల కన్ను..

(మొదటి పేజీ తరువాయి)

సమాజ్‌వాదీ పార్టీ గత పాలనలో బుందేల్‌ఖండ్ ప్రజలను పూర్తిగా విస్మరించినందుకు అఖిలేష్ యాదవ్‌పై విరుచుకుపడ్డారు. ఎస్పీకి అభివృద్ధి ఆధారిత ఆలోచన లేదని ఎత్తి చూపిన యోగి, గత ప్రభుత్వాలు మొత్తం ప్రాంత అభివృద్ధిని విస్మరించాయని అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడ చూసినా అల్లర్లు జరిగేవని, అభివృద్ధి స్తంభించిపోయి అరాచకాలు తారాస్థాయికి చేరాయని, కానీ నేడు అలాంటి పరిస్థితి లేదని, అల్లర్లు లేవు, అభివృద్ధి మాత్రమే జరుగుతుందని ఈ సందర్భంగా యోగి స్పష్టం చేశారు.

## మా కొడుకు మరణం వెనుక అసలు నిజాలను వెలికి తీయండి : మృతుని తల్లిదండ్రుల రోదన



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి) : కూలి పనులు చేసుకుంటూ అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమారుని మరణం వెనుక అనేక అనుమానాలున్నాయని పోలీసులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను నిగ్గు తేల్చాలని తల్లిదండ్రులు మీడియా ముందు రోదించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్గొండ జిల్లా చంద్ర పేట కు చెందిన రాము నాయక్, లక్ష్మి లు తమ గోడును వెలిబోసుకున్నారు. సైదాబాద్ లో నివాసముంటూ కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని వెళ్లదీస్తున్నామని తెలిపారు. తమకు ముగ్గురు సంతానం కాగా మొదటివాడైన శివ రాము (18) ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించే వాడని తెలిపారు. గత ఏడాది ఆగస్టు 23వ తేదీన తీజ్ పండుగ ఉందని తమ దూరపు బంధువైన లక్ పతి తమ కుమారునికి ఫోన్ చేసి పిలిపించారని తెలిపారు. అక్కడినుంచి నక్కలగండి కి తీసుకెళ్లి కొంతమంది యువకులు నీళ్లలో ముంచి హత్య చేశారని అన్నారు. తాము సంఘటన స్థలానికి చేరుకునేలోపే ప్రమాదవశాత్తు నీళ్ళల్లో మునిగి చనిపోయాడంటు నాగర్ కర్నూలు జిల్లా సిద్ధాపూర్ పోలీసులు కేసును తప్పుదోవ పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కొడుకుకి స్వయంగా తానే ఈత నేర్పించానని, ఈత లో ప్రావీణ్యం ఉన్న తమ కుమారుడు నడుము కంటే కొంచెం లోతైన ప్రదేశం లో ఎలా మరణిస్తాడని ప్రశ్నించారు. ముమ్మాటికీ తమ కుమారుడిది హత్యేనంటూ కన్నీరు పెట్టుకున్నారు. మృతి చెందిన నాలుగైదు నెలల అనంతరం మరణానికి ముందు తీసిన వీడియో ను సేకరించి ఎస్ ఐ గురు స్వామి కి అప్పగిస్తే విచారణ చేపట్టకుండా తమని దూషించారని కన్నీరు పెట్టుకున్నారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలంటూ జిల్లా ఎస్పీ డి ఐ జి చివరకు హైదరాబాదులోని డిజిపి కార్యాలయానికి వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ కుమారుడి మరణానికి కారణమైన బబ్లు ఇస్లావత్ మహేష్ నరేష్ సాయి రాముల పై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# 2023 కాంగ్రెస్‌కు చివరి ఎన్నికలు..

(మొదటి పేజీ తరువాయి)

వర్గాల నాయకులు జాబ్రా నుండి ఆయనను కలవడానికి వచ్చారు. వివిధ వర్గాల నాయకుడు దిగ్విజయ్ సింగ్ విడివిడిగా కలవాలనుకున్నారు. అయితే ఆయన అందరూ కలిసి కలవాలని పిలుపునిచ్చారు. దిగ్విజయ్ సింగ్ జాబ్రా ఈ కాంగ్రెస్ నేతలతో చర్చిస్తూ మీరు ఒకరితో ఒకరు రావడానికి సిద్ధంగా లేరు. ఒకరితో ఒకరు మాట్లాడటానికి సిద్ధంగా లేరు. అందరూ కలిసి ఎన్నికల్లో పోటీ చేయకుంటే 2023 ఎన్నికలే కాంగ్రెస్‌కు చివరి ఎన్నికలు అని గుర్తుంచుకోవాలన్నారు. దీని తర్వాత ప్రజలు కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో అవకాశం ఇవ్వరు అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో స్థానిక నేతలు ఆయన మాటలతో విస్తుపోయారు. అసలే మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పీకలలోతు కష్టాల్లో ఉన్న కాంగ్రెస్‌కు ఆయన వ్యాఖ్యలు కృంగదీశాయి. దిగ్విజయ్ సింగ్ కార్యకర్తలతో జరిగిన ఈ అనధికారిక చర్చను కొందరు మీడియా ప్రతినిధులు రికార్డ్ చేశారు. ఈ విషయం దిగ్విజయ్ సింగ్ దృష్టికి రావడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మొత్తం ఘటన కూడా రికార్డు అయింది. ఇందుకు సంబంధించి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇదిలావుంటే, మధ్యప్రదేశ్‌లో 2023 చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2018లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 15 సంవత్సరాల విరామం తర్వాత కాంగ్రెస్ తిరిగి మధ్యప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. అయితే, 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి ఫిరాయించడంతో ముఖ్యమంత్రి కమల్ నాథ్ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 15 నెలలు మాత్రమే కొనసాగింది. మరోసారి ఎంపీలో భారతీయ జనతా పార్టీ అధికారం చేజిక్కించుకుంది.

## జీయర్ స్వామి ఆహ్వానాన్ని పట్టించుకోని కేసీఆర్



హైదరాబాద్: సీఎం కేసీఆర్, చినజీయర్ స్వామి మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముచ్చింతల్‌లో నిర్వహిస్తున్న సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా శాంతికల్యాణాన్ని ఈ నెల 19న నిర్వహించాలని అనుకున్నారు. శాంతి కల్యాణ కార్యక్రమాన్ని కేసీఆర్ కోసమే వాయిదా వేశారని ప్రచారం జరిగింది. అయినా ముచ్చింతల్ కార్యక్రమానికి కేసీఆర్ డుమ్మా కొట్టారు. జీయర్ స్వామి ఆహ్వానాన్ని కేసీఆర్ పట్టించుకోలేదు. కేసీఆర్ ముచ్చింతల్ కార్యక్రమ రద్దుతో మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. శ్రీరామానుజ సహస్రాబ్ది వేడుకల ముగింపు కార్యక్రమానికి సీఎం దూరంగా ఉన్నారు. కేసీఆర్‌ను ఈ కార్యక్రమానికి రప్పించేందుకు చినజీయర్ స్వామితోపాటు మైహోం సంస్థల అధినేత రామేశ్వరరావు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఇంతలోనే కేసీఆర్, చినజీయర్ మధ్య విభేదాలున్నాయనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌తో విభేదాలపై చినజీయర్ వివరణ ఇచ్చారు. కేసీఆర్‌తో తనకు ఎటువంటి విభేదాలూ లేవని త్రిదండి చినజీయర్‌స్వామి స్పష్టం చేశారు. సహస్రాబ్ది ఉత్సవాలకు మొదటి సేవకుడిని తానేనని సీఎం ప్రకటించారని.. అలాంటి వ్యక్తితో తమకు ఎందుకు విభేదాలుంటాయని ప్రశ్నించారు. ఇది ఎవరో సృష్టించారని చినజీయర్ పేర్కొన్నారు.

# దారిలోకి తెచ్చుకునే మంత్రం..

## ఈడీ, ఐటీ, సిబిఐ కేంద్రం చేతిలో కీలుబొమ్మలా?

దారిలోకి వస్తే సరే.. లేకపోతే అంతే సంగతులు. ప్రత్యర్థులను దారిలోకి తెచ్చుకునేందుకు సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించడం మనకు తెలిసిందే. భారత రాజకీయాల్లో ఇప్పుడు ఇది బాగా హాట్ టాపిక్కైంది. అధికారంలో ఎవరున్నా కేంద్రంలోని పాలకులపై ఇదే విమర్శలు. చెప్పింది వింటే సరేసరి. లేకపోతే వారి పై కేసులు, సోదాలు షరామామూలు వ్యవహారం వైందనే విమర్శలొస్తున్నాయి. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ ఇదే పని చేసిందనే ఆరోపణలు రాగా.. ఇప్పుడు భారతీయ జనతా పార్టీ పైనా అదే తరహా విమర్శలు గుప్పుమంటున్నాయి. తమ రాజకీయ ప్రయోజనాలకు ఈడీ, ఐటీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను కీలుబొమ్మలుగా కేంద్రం వాడుకుంటోందని విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఇప్పుడు ఈ కేసులు రావడం ఉత్కంఠను పెంచుతోంది. ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు రచించడం మాములు విషయమే. కాకపోతే ఇప్పుడు ఆర్థికంగా దెబ్బతీసే కుట్ర జరుగుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇందుకు ఇటీవల జరుగుతున్న పరిణామాలను సాకుగా చూపడం ఆసక్తికరం.

కేసులు ఎన్ని ఉన్నాయంటే..

భారతదేశవ్యాప్తంగా మొత్తం 121మంది ప్రజాప్రతినిధులపై సీబీఐ కేసులున్నాయి. 122 మంది నేతలపై ఈడీ కేసులుండటం మాములు విషయం కాదు. ఎంపీ, ఎమ్మెల్యేలపై ఈ కేసుల విచారణ కొనసాగుతోంది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు తెలిపింది అమికస్ క్యూరీ. ఏళ్ల తరబడి కేసులు పెండింగ్ లో ఉండటం ఇబ్బందికరమే. ఈ లోపే నేతలు మరోసారి చట్టసభలకు ఎన్నికవుతున్నారు. ఫలితంగా మంచివాళ్లే కాదు.. అక్రమార్కులు సభలో అడుగుపెట్టడం ప్రజాసామ్య భారతానికి వన్నె తెచ్చేది కాదు. భారతదేశంలో సీబీఐ కేసులు ఎదుర్కొంటున్న 121 మందిలో 14 మంది సిట్టింగ్ ఎంపీలు కాగా.. 107 మంది మాజీ ఎంపీలు ఉన్నారు. ఓ ప్రజా ప్రతినిధిపై కేసు 20 ఏళ్లకు పైగా కేసు పెండింగ్ లో ఉంది. 121 కేసుల్లో 58 కేసుల్లో జీవిత ఖైదు, 48 కేసుల్లో సుదీర్ఘ కాలం శిక్ష పడే అవకాశం ఉంది. 51 మంది తాజా, మాజీ ఎంపీలపై మనిలాండరింగ్ కేసులు ఉండటం సాధారణ విషయం కాదు.

కేసుల బూచీ..

పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ మేనల్లుడు టీఎంసి ఎంపీ అభిషేక్ బెనర్జీ, ఆయన భార్య రుజీరా బెనర్జీకి ఈడీ నోటీసులిచ్చి విచారించింది. బెంగాల్ బొగ్గు స్కామ్ లో ఆయన పై ఆరోపణలు చేసింది. అంతే కాదు తమిళనాడు సిఎం స్టాలిన్ కూతురు శంతమరాయి ఇంట్లో ఐటీ సోదాలు జరిగాయి. పంజాబ్ సీఎం చన్నీ మేనల్లుడు భూపిందర్ సింగ్ హనీ పై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. ఈడీ అరెస్టు చేసింది. అక్రమ ఇసుక మైనింగ్ కేసులో భూపేందర్ సింగ్ హనీ పై ఆరోపణలున్నాయి. ఆయన ఇళ్లు, పలు కార్యాలయాల్లో దాడులు నిర్వహించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. అంతే కాదు.. బీజేపీపై గట్టిగా గళం వినిపించే ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌పై %చీ×ూ% కేసు పెట్టేందుకు సిద్ధమైందనే లీకులు వస్తున్నాయి. ఇప్పటికే సిఎం అధికారాలకు కత్తెర వేసి లెఫ్టినెంట్ జనరల్ కు బాధ్యతలు అప్పగించారనే వాదనుంది. ముందరి కాళ్లకు బంధం వేసినట్లుగా చేస్తుందంటున్నారు. ఇక ఉత్తరప్రదేశ్ లోని సమాజ్ వాదీ నాయకుల ఇళ్లల్లో ఐటీ సోదాలు జోరుగా సాగుతున్నాయి. ఆ పార్టీ నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నారనే వాదనుంది. ఇంకోవైపు ఆంధ్రప్రదేశ్ లో సిఎం జగన్మోహన్ రెడ్డి బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ ఛార్జిషీట్ వేసింది. ఇందులో ఎంపీ అవినాష్ రెడ్డి పేరుపై రగడ రేగుతోంది. ఇప్పటికే అక్రమాస్తుల కేసులో సిఎం జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి కోర్టులకు హాజరవుతున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వారి పై కేసులు రావడం వెనుక సోనియా హస్తం ఉందనే విమర్శలు లేకపోలేదు. ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ పై నిప్పులు చెరుగుతున్న తీరు చర్చనీయాంశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ సొంత సంస్థలు ఈడీలు, సీబిఐలకు నేను భయపడనని బాహాటంగానే చెబుతున్నారు రాహుల్ గాంధీ. 2006లో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నారు తెలంగాణ సిఎం కేసీఆర్. ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణ కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో 2015 అక్టోబర్ 22న సిబిఐ విచారించింది. దీని పై సరైన ఆధారాలు లేకపోవడంతో పక్కన పెట్టేసింది.

పులిమీద సవారీ..

నాపై ఎన్ఐఏ కేసు పెడుతున్నట్టు తెలిసింది.. మంచి పనులు చేసేవాళ్లను ఉగ్రవాదులుగా చూస్తారా? ఇదే మీరు చేసేది అంటూ ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తీరు ఆసక్తకరమే. ఆయనే కాదు తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేను సైతం అంటున్నారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తోంది. దేనికైనా రెడీ అంటున్నారు. ఇదంతా పులిమీద సవారీనే. ఎదురుతిరిగితే పోయేదేముంది. కొత్తగా మరిన్ని సీట్లు రావడం తప్పా అంటున్నారు గులాబీ నేతలు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఈడీ, ఎన్ఐఏ, ఐటీ, సిబిఐలు వచ్చినా తగ్గేదేలే అంటున్నారు ఇంకోవైపు తెలంగాణ మంత్రి కే.తారకరామారావు. ఈ దర్యాప్తు సంస్థలు గుజరాత్ మోసాలపై ఎందుకో కేసులు పెట్టవుఅనే అనుమానం వ్యక్తం చేశారు శివసేన ఎంపీ సంజయ్ రౌత్ లాంటి నేతలు. రాష్ట్రంలో ఐటీ ముందుగా వచ్చింది. తర్వాత ఈడీ, సిబిఐ వస్తాయి. ఏం జరుగుతుందో అర్థమవుతోందని యూపీ మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ చెబుతున్న ప్రజల్లో చర్చకు దారితీసింది. అధికార ప్రభుత్వం చేతిలో సిబిఐ కీలు బొమ్మ అనే కామెంట్లు వస్తున్నాయి. ఎదురు తిరిగితే వారిని దారిలోకి తెచ్చుకునేందుకు సిబిఐతో కేసులు వేయిస్తుందనే వాదనలొస్తున్నాయి. జగన్, చంద్రబాబు, జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్, హర్యానా మాజీ సిఎం భూపేందర్ హుడా, సోనియా అల్లుడు రాబర్ట్ వాద్రా, చిదంబరం వంటి వారు ఈడీ, సిబిఐ, ఐటీ కేసులు ఎదుర్కున్నవారే. మరికొందరి పై ఇంకా కేసులు కొండవీటి చాంతాడులా ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర మాజీ మంత్రి చిదంబరం, సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా పై కావాలనే కేసులు పెట్టారని కాంగ్రెస్ అంటోంది. ఉత్తరప్రదేశ్ మాజీ సిఎం మాయావతిపై 12 ఏళ్ల తర్వాత ఈడీ దాడులు పెట్టడం. ఇద్దరు మాజీ మంత్రులు అరెస్టు చేయడం ఎన్నికల వ్యూహం కోసమే అనే వాదన లేకపోలేదు. ఇక కేరళ సిఎం పినరయ్ విజయన్‌ను సిబిఐ ప్రశ్నించేందుకు సుప్రీంకోర్టు అనుమతి కోరడం వెనుక వ్యూహం కొనసాగుతుందంటున్నారు కామ్రేడ్స్. దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వెయ్యాలని వ్యూహంలో భాగమే కర్నాటక, తమిళనాడు, కేరళ, ఏపీ, తెలంగాణలో నేతల పై మనీలాండరింగ్ కేసులు, ఈడీ దాడులు, సిబిఐ ఎంక్వైరీలు అంటున్నాయి విపక్షాలు. ఆ కేసులు ఏమయ్యాయి.. కేంద్ర మంత్రి అమిత్ షా కొడుకు జైషాపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. షిర్డీ ఇండస్ట్రీస్ స్కాంలో పీయూష్ గోయెల్‌పై ఆరోపణలు ఉన్నాయి. మధ్యప్రదేశ్ వ్యాపం కుంభకోణం, షాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్, గుజరాత్ అల్లర్లు కేసులను మోదీ సర్కార్ పక్కన పెట్టిందనే వాదన చేస్తున్నాయి మిగతా పక్షాలు. విషయం ఏదైనా అధికార పార్టీ చేతిలో కేంద్ర దర్యాప్తు సంస్థలు కీలుబొమ్మలనే కామెంట్లు రావడం ఇప్పుడే కొత్త కాదు. యుపిఏ హయాంలోను వచ్చాయి. ఎన్డీఏ కాలంలోను కొనసాగుతున్నాయి. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటే రాజకీయ కుట్ర అంటున్నారని అధికార పార్టీ..కాదు కాదు ఓటమిని జీర్ణించుకోలేక ఈ విమర్శలు అంటున్నాయి విపక్ష పార్టీలు. వీటినేమి పట్టించుకోకుండా రాజకీయాలను పక్కన పెట్టి త్వరితగతిన కేసులను విచారించి అక్రమార్కులకు శిక్ష పడేలా చేస్తేనే భారత ప్రజాసామ్య పరిరక్షణకు మేలు జరిగినట్లు అవుతోంది.

## బహుజనుల ఐక్యతే బహుజన రాజ్యాధికారానికి తొలిమెట్టు: డాక్టర్ కటికల శివ భాగ్యారావు







గుంటూరు(ప్రజాపాలన ప్రతినిధి) :బహుజనులు ఐక్యంగా ఉండి పోరాడితేనే బహుజన రాజ్యాధికారం సాధించగలమని అన్నారు స్నేహా సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు.గుంటూరు లోని స్థానిక సహకార శాఖభవనం లో జరిగిన పార్లమెంట్ సమావేశం లో ఆయన మాట్లాడుతూ, పార్స్ యొక్క నిర్మాణం గురించి వివరంగా సభ్యులకు తెలియజేశారు. ప్రధానంగా బహుజన సోదరులు అందరూ ఐకమత్యంతో అవగాహనతో సమిష్టిగా కృషి చేసిన బహుజన రాజ్యాధికారం సాధించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు . పార్స్ ఆశయాలను ఆయన అందరికి వివరించారు.బీసీలను ముఖ్యమంత్రిగా చేయడం ఎస్టీ ఎస్సీ ముస్లిం , క్రిస్టియన్ బుద్ధిష్ట్ లకు ప్రత్యేక నియోజకవర్గాలు ఇప్పటి వరకుఅసెంబ్లీ కి వెళ్ళని కులాలను అసెంబ్లీ కి పంపుట మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం రిజర్వేషన్లు వద్దు రిప్రజెంటేషన్ ముద్దు కులాంతర వివాహం చేసుకున్న వారి పిల్లలకు సమతా కులంగా నామకరణం చేయుట లాంటి పార్స్ ఆశయాలు నెరవేర్చడం కొరకు అందరూ కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా కటికల.ర వికుమార్ ను పార్స్ స్టేట్ కోఆర్డినేటర్ గా, పిల్లిరాజు ను స్టేట్ సెక్రటరీగా,కుకట్లపల్లి.ప్రసాద్ ను స్టేట్ సెక్రటరీ గా నియామక పత్రాలను అందించినారు.ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు పలువురు బహుజన నాయకులు పాల్గొన్నారు.

## ఆర్. ఓ. బి. కింద అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలి : అధికారులకుసూచించిన కలెక్టర్ గౌతమ్



బోనకల్, ఫిబ్రవరి 19 ప్రజా పాలన ప్రతినిధి : మండల కేంద్రం లోని 117 రైల్వే గేట్ పై నిర్మించిన ఆరో బి క్రింద ఉన్న అక్రమ కట్టడాలను మరియు బడ్డి షాపు లను వెంటనే తొలగించాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ ఆదేశించారు. శనివారం బోనకల్ మండల రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ,మరియు పోలీస్ అధికారులతో కలిసి ఆర్.ఓ.బి కింద ఉన్న కట్టడాలను ఆయన పరిశీలించారు. వారం రోజులలో అక్రమ కట్టడాలను ,మరియు బడ్డికొట్లను అధికారుల సమన్వయంతో తొలగించాలని లేని యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన న న నవెంట బోనకల్ మండలం తాసిల్దార్ రావూరి రాధిక, ఎంపీడీవో జి శ్రీదేవి.ఆర్.ఐ. లక్ష్మణ్ పంచాయతీ కార్యదర్శి కిరణ్ తదితరులు ఉన్నారు.

## జగ్గారెడ్డితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ



హైదరాబాద్: ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గీతారెడ్డి పాల్గొన్నారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇంటికి జగ్గారెడ్డిని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తీసుకొచ్చారు. జగ్గారెడ్డి పార్టీకి రాజీనామా చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. జగ్గారెడ్డి పార్టీని విడద్దంటూ ఉత్తమ్, గీతారెడ్డి బుజ్జగిస్తున్నారు. సమస్యలుంటే ఢిల్లీలో తేల్చుకుందామని సూచించినట్లు సమాచారం. అధినేత రాహుల్ గాంధీని కలిసి జరుగుతున్న వ్యవహారాలను, తనకు జరిగిన అవమానాలను వివరించాలని జగ్గారెడ్డికి ఉత్తమ్ సూచించారు. పార్టీని వీడతానని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జగ్గారెడ్డికి నేతలు సూచించారు.

# ప్రజల సౌకర్యార్థం సమీకృత మార్కెట్ ఏర్పాటు

**జిల్లా కలెక్టర్ భారతి హెూళ్ళికేరి**



నస్పూర్, ఫిబ్రవరి 19, ప్రజాపాలన ప్రతినిధి : ప్రజల సౌకర్యార్థం అన్ని రకాల కూరగాయలు, మాంసం ఒకేచోట లభించే విధంగా సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ భారతి హెూళ్ళికేరి అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం కేటాయించిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉన్నాయని, ప్రతి మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం 7 కోట్ల 20 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ మార్కెట్లో కూరగాయలు, మాంసం, పూలు ఇతరత్రా విక్రయించేందుకు వేరువేరుగా ప్లాట్ ఫామ్లు నిర్మించడం జరుగుతుందని, నిర్మాణ పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేయాలని గుత్తేదారులకు సూచించారు. ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం కేటాయించిన 42 ఇండికేటర్ లలో సమీకృత మార్కెట్ కూడా ఉందని, ఇందులో కూరగాయలు, మాంసం నిల్వ ఉంచేందుకు కోల్డ్ స్టోరేజ్ గదిని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2 ఎకరాల 8 గుంటల విస్తీర్ణంలో ఈ మార్కెట్ నిర్మాణం జరుగుతుందని, ఇందులో విక్రయాలు నిర్వహించేందుకు గాను 86 స్టాళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, మిగిలిన ప్రదేశాన్ని సైతం వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో సహజయోగ ధ్యాన సాధన అవగాహన కార్యక్రమం



మేడిపల్లి, ఫిబ్రవరి 19 (ప్రజాపాలన ప్రతినిధి) :శ్రీ మాతాజీ నిర్మలా దేవి తన అవతారాన్ని చాలించికుని నిరాకారం లోనికి వెళ్లిపోయిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా సహజయోగ ధ్యాన కేంద్రాల్లో ప్రతి ఏటా ఫిబ్రవరి 23న పరమ చైతన్య దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మేడిపల్లి లోని శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 20 తేదీన ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సహజయోగ ధ్యాన సాధన గురించి అవగాహన, పరిచయం మరియు ఆత్మసాక్షాత్కార స్వీయ అనుభూతి కార్యక్రమాన్ని ప్రజా ప్రయోజనార్థం ఏర్పాటు చేస్తున్నామని సహజయోగా ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ కె వెంకట్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం, మానసిక ఒత్తిడి మరియు ప్రశాంతతకు సహజయోగ ధ్యానం సరైన పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. సహజయోగం వలన కలిగే వివిధ ఉపయోగాలు, అంశాలపై సోదాహరణ ఎగ్జిబిషన్ మరియు వీడియో డాక్యుమెంటరీ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. సహజయోగా కార్యక్రమాలన్నీ పూర్తిగా ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడిపల్లి లోని ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సహజయోగ ధాన్యం అవగాహన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జి లక్ష్మణ్ రావు, ఎం నాగరాజు, సుధాకర్ రావు, సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ భారతి హెూళ్ళికేరి**



నస్పూర్, ఫిబ్రవరి 19, ప్రజాపాలన ప్రతినిధి: మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ భారతి హెూళ్ళికేరి అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అంచనా బడ్జెట్ 21 కోట్ల రూపాయలను కౌన్సిల్ సభ్యుల అంగీకారంతో ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని తెలిపారు. సాధారణ ఆదాయము 6 కోట్ల 97 లక్షల రూపాయలు, క్యాపిటల్ ఆదాయము 13 కోట్ల 65 లక్షల రూపాయలు కాగా సాధారణ వ్యయములు 6 కోట్ల 84 లక్షల రూపాయలు, క్యాపిటల్ వ్యయములు 12 లక్షల రూపాయలు, గ్రాంట్లు 13 కోట్ల రూపాయలు, డిజిటల్ గ్రాంట్లు, అడ్వాన్సుల క్రింద 65 లక్షల రూపాయలుగా ఆమోదించడం జరిగిందని, గ్రీన్ బడ్జెట్ కోసం కేటాయించగా మిగులు బడ్జెట్ 38 లక్షల రూపాయలుగా ఉంటుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీటిని వినియోగించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, నల్లా, ఇతరత్రా అన్ని రకాల పనులను సకాలంలో వసూలు చేయాలని, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజలింగు, చైర్మెన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## విజయవంతమైన మమత హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరం

**ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించిన వైరా ఏసిపి స్నేహ మ్హెహ్రా**



మధిర ఫిబ్రవరి 19 ప్రజా పాలన ప్రతి నిధి మధిర మున్సి పాలిటీ పరిధిలో గ్రామంలో శని వారం నాడు గ్రామంలో మమత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆ గ్రామ ఆర్ఎంపీ వైద్యులు మల్లికార్జున రావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైనది. శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వైరా ఏసిపి స్నేహం మ్హెహ్రా ప్రారంభించారు.ఈ వైద్య శిబిరంలో సుమారు మమత హాస్పిటల్ కి చెందిన వైద్యులు సిబ్బంది 42 మంది పైగా పాల్గొన్నారు. 452 మంది రోగులకు వివిధ రకాల వైద్యాలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందుల నుంచి వైద్య చికిత్స అవసరం ఉన్న వారిని మమత ఆసుపత్రికి రావాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి ఇ వో వై ప్రభాకర్ టౌన్ రూరల్ ఎస్సై లు సతీష్ కుమార్ ప్రియాంక ఒకటవ వార్డు కౌన్సిలర్ పగిడిపల్లి విజయమ్మ కాశి రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

## జాగృతి హాస్పిటల్ లో రక్తదాన శిబిరం




వైరా: మహారాజా చత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని జాగృతి హాస్పిటల్ లో రక్తదాన శిబిరం మరియు అవయవ దానం శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో సీనియర్ భాజపా నాయకులు వైరా పట్టణ బిజెపి అధ్యక్షులు ఆ లే భద్రయ్య గారు ఖమ్మం జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి భూక్య శ్యాం సుందర్ నాయక్, వైరా అసెంబ్లీ కన్వీనర్ బండారు నరేష్ గారు వైరా పట్టణ ప్రధాన కార్యదర్శి పాప కంటి నరేష్ , బీజేవైఎం అధ్యక్షులు పిల్లి వెంకట సతీష్ , కూరగాయల దిలీప్ గారు వైరాజాగృతి హాస్పిటల్ డాక్టర్ కే. మోహన్ రావు గారు మరియు ఆర్కె గారు , అభిలాష్ గారు కోళ్ల వంశీ గారు , తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రెండు తెలుగు రాష్ట్రాలలో స్కూటీల పేరుతో మోసం చేసిన కేటుగాడు



మధిర ఫిబ్రవరి 19 ప్రజా పాలన ప్రతినిధి :మధిర మునిసిపాలిటీ నందు చేరుకుమల్లి వారి వీధిలో నివాసం ఉంటున్న ముప్ప సాని రాధాకృష్ణ ,తండ్రి వీరయ్య అనే వ్యక్తి హరే రామ హరే కృష్ణ అనే ఓ స్వచ్ఛంద సంస్థ పేరుతో మధిర పరిసర ప్రాంతాల్లోనే కాదు.పక్క రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్ కృష్ణాజిల్లా నందిగామ కంచికచర్ల ,చందర్లపాడు వంటి ప్రాంతాలలో కూడా ఎంతో మంది ప్రజలకు సబ్సిడీపై 65 వేల రూపాయలకు హెూండా యాక్టివా స్కూటీ లను, కుట్టు మిషను ల్యాప్టాప్లను అందిస్తామని నమ్మిన కొంతమంది ప్రజలు అతనికి 200 మంది బాధితులు ముందస్తుగా డబ్బులు చెల్లించి ఉన్నారు.డబ్బు ఇచ్చిన వారికి స్కూటీ లు, ల్యాబ్ టాప్, కుట్టు మిషన్లు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని వాపోతూ కొంత మంది బాధితులు మధిర టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఇప్పటి వరకు మధిర చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలు మోసపోయారని అనుకుంటుంటే ఇతని మోసాలు తెలంగాణ లోనే కాదు ఆంధ్రప్రదేశ్ లో కూడా అనేక ప్రాంతాలలో ఇతని వల్ల మోసపోయిన వ్యక్తులు మధిర టౌన్ పోలీస్ స్టేషన్ లో ఈరోజు సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేసినారు. ఇంకా ఈ మోసాలపై రోజురోజుకు పెరుగుతున్న బాధితులు. హరే రామ హరే కృష్ణ బాధితులు ఇంకా ఎందరున్నారో .



ప్రజాపాలన

సంపాదకీయం

ఆదివారం 20, ఫిబ్రవరి 2022

# హక్కుల దృక్పథానికి గ్రహణం

రాజ్యాంగ పదవులలో ఉన్న లేదా ప్రజాజీవితంలో ప్రముఖులుగా ఉన్న వ్యక్తుల భావాలు, అభిప్రాయాలు ఏ సమాజంలోనైనా ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తాయి. సామాన్యుల పిచ్చాపాటీలోను, మేధావుల చర్చలలోను అవి ప్రధాన అంశాలుగా ఉంటాయి. ఇప్పుడు మన దేశంలో విధులు–హక్కులు అనే అంశం ఆ విధమైన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ప్రజలు నిత్యం హక్కుల గురించే మాట్లాడుతూ తమ విధులు లేదా బాధ్యతలను విస్మరిస్తున్నారనే భావనతో మన పాలకులు అప్పుడప్పుడు మనం నిర్లక్ష్యం చేస్తున్న విషయాల గురించి ఉపదేశిస్తుంటారు. అత్యున్నత అధికార ప్రాభవంతో వెలిగిపోతున్నవారి మాటలను అంత తేలిగ్గా తోసిపుచ్చలేం. అవి సర్వసాధారణమైనవే అయినప్పటికీ, మన సంచిత విజ్ఞానం, విద్వత్ గరిమతో ఆ మాటలను నిశితంగా తర్కించడంలో నిమగ్నులమవుతాం. ఆ మాటలు అల్పమైనవి లేదా అప్రధానమైనవే కావచ్చు గానీ వాస్తవంగా అవి మన రాజ్యాంగ విలువలు, ప్రధాన సూత్రాలపై దాడి చేసినవి కావడంతో వాటిని మన చారిత్రక అనుభవాల వెలుగులో, సంవిధాన సంప్రదాయాల స్ఫూర్తితో పరీక్షించడం తప్పనిసరి అవుతుంది. వర్తమానాన్ని సంక్షుభిత పరుస్తున్న సంఘటనలనే పరిగణనలోకి తీసుకోండి. అత్యంత అరుదుగా సంభవించే ఒక భయానక మహామారి సాన్నిహిత్యంలో మన జీవితాలు సాగుతున్నాయి. కుటుంబాలు, ఇరుగు పొరుగులు, సామూహిక బృందాలు, పని ప్రదేశాలు కొవిడ్–19 బాధితమయి ఉన్నాయి. మనుగడ సంక్షోభాల వెల్లువలో చిక్కుకుంది. సంఖ్యానేకులు తమ జీవనాధారాలు, ఉద్యోగాలు కోల్పోయారు. 'ఆర్థిక శ్రేయస్సు'కు 'గిగ్ ఎకానమీ' (కాంట్రాక్ట్ పనుల ఆర్థికవ్యవస్థ) ఆలంబన అయింది! చిన్నారుల భవిష్యత్తు అపాయంలో పడింది. ప్రాథమిక విద్యాభ్యాసం సైతం ఆన్‌లైన్‌లో జరుగుతోంది! ఈ అతి నవీన విద్యాబోధనను పొందగల సదుపాయాలు ఎంత మందికి ఉన్నాయి? అధికరణ 21–ఎ ద్వారా భావి పౌరులకు మన రాజ్యాంగం కల్పించిన 'విద్యాహక్కు' అసంఖ్యాక బాలలకు సమకూరడమే లేదు. విద్య కంటే అధ్వాన్నం వైద్యం. ఆరోగ్య భద్రతకు భరోసా కరువయింది. ప్రజారోగ్య వ్యవస్థకే అనేక అనారోగ్యాలు. ఈ విషమ పరిస్థితుల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించవలసిన ప్రభుత్వాల ఆలోచనలు భిన్నంగా ఉన్నాయి. వింత గొలుపుతున్నాయి. ప్రజలకు శ్రేయస్సును సమకూర్చడంలో పాలకులకు స్పష్టమైన బాధ్యతలను భారత రాజ్యాంగం నిర్దేశించింది. అయితే రాజ్యాంగ విహిత బాధ్యతలను నిర్వర్తించేందుకు తాము ఎలాంటి చర్యలు చేపడతున్నదీ అడగవద్దని పాలకులు అంటున్నారు. 'జాతి'కి సేవ చేయడమే మీ విధ్యుక్త ధర్మమని, దానిని పాటించాలని కోరుతున్నారు. హక్కుల (రైట్స్)ను డిమాండ్ చేయకుండా విధుల (డ్యూటీస్)ను శిరసావహించాలని ఉపదేశిస్తున్నారు. ఈ సందేశాన్ని ఇస్తున్నవారు తొలుతనే చెప్పినట్టు అత్యున్నత రాజ్యాంగ పదవులలో ఉన్నవారే. 2020 ఫిబ్రవరి 20న నాటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎ బాబ్డే, 2022 జనవరి 21న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, 2022 జనవరి 26న రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ హక్కులను కాకుండా విధులను పట్టించుకోవాలని ఈ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హక్కుల కంటే విధులకు ప్రాధాన్యమివ్వాలని వారు ప్రబోధించిన సందర్భాన్ని గమనంలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. అల్లర్లు, రాజ్యవ్యవస్థ బాధ్యతారాహిత్య నేపథ్యంలోనే వారు ఆ విజ్ఞప్తులు చేశారు. భారత స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్న సంవత్సరంలోనే దేశ ప్రజలు తమ హక్కుల గురించి నొక్కి చెప్పవలసిరావడం ఎంత విషాదకరం? ఇప్పటికే చవిచూస్తున్నవే కాకుండా మరెన్ని కష్టనష్టాలు సంభవించినా సరే ప్రజలు తమ హక్కుల గురించి, అధికారంలో ఉన్నవారు 'వినేందుకు' వీలుగా పదేపదే ఎలుగెత్తవలసిన అవసరం ఎంతైనా ఉంది. పలువురు న్యాయశాస్త్ర కోవిదులు పౌరుల హక్కులు, విధులను కలిపివేసి, ఆ రెండిటినీ ఒక్కటిగా భావించడం జరిగింది. రాజ్యాంగం గురించి లోపభూయిష్ట అవగాహన కారణంగానే వారలా భావించారని నేను మళ్ళీ చెబుతున్నాను. హక్కులు, విధులు భిన్నమైనవి. హక్కుల కంటే విధులకే రాజ్యవ్యవస్థలు ఎందుకు ప్రాధాన్యమిస్తాయో తరచి చూద్దాం. భారత రాజ్యాంగంలోని అధికరణ 51–ఎ (ప్రాథమిక విధులు)ను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే అత్యవసర పరిస్థితి కాలంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం ఈ అధికరణను జోడించడం జరిగింది. 42వ రాజ్యాంగ సవరణ మన ప్రస్తుత చర్చకు మరింత సందర్భశుద్ధిగల అంశం. ఆ సవరణ ద్వారానే రాజ్యాంగ పీఠికలో 'సామ్యవాద, లౌకిక' (సోషలిస్ట్, సెక్యులర్) అనే పదాలను చేర్చడం జరిగింది. మనదేశంలో సామ్యవాద భావజాల సంప్రదాయాలను గుర్తుచేసుకోవడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుంది. సామ్యవాదం అనే పదాన్ని రాజ్యాంగ భూమికలో చేర్చిన సందర్భంలో దేశవ్యాప్తంగా సోషలిస్టులు జైలులోనో లేక అరెస్ట్‌ను తప్పించుకోవడానికి అజ్ఞాతవాసంలోనే ఉండడం జరిగింది. జార్జి ఫెర్నాండెజ్ ఇందుకొక ఉదాహరణ. తెలుగు సమాజం విషయానికి వస్తే కవి చెరబండరాజు అత్యవసర పరిస్థితిలో జైలులో ఉన్నారు. ఉద్యోగం నుంచి ఆయనను సస్పెండ్ చేశారు. హైకోర్టులో ఒక కేసు విచారణ సందర్భంగా వాక్ స్వాతంత్ర్యం, రాజకీయ అసమ్మతికి మద్దతుగా ఆయన 'ఇందిరమ్మా నీ సోషలిజం చాలు చాలు' అనే స్వీయ గీతాన్ని ఆలాపించారు. 'సామ్యవాద' అనే పదం ఇప్పుడు రాజ్యాంగ మున్నుడిలో అంతర్భాగం అనేది నిర్వివాదం. అయితే ఆ భావనను రాజ్యాంగ ప్రస్తావనలో చేర్చిన సందర్భానికి ఒక ప్రాధాన్యమున్నది. రాజ్యాంగ అవతారికలో చొప్పించిన పదానికి, దేశంలోని సామ్యవాద భావజాల సంప్రదాయాల మధ్య రాజకీయ వ్యత్యాసమున్నది. ఇది గమనార్హమైన వాస్తవం. 1975 జూన్ 26న అత్యవసర పరిస్థితిని విధించిన నాటినుంచి 1977 మార్చి 21న దాన్ని ఎత్తివేసేంతవరకు ఆ చీకటిరోజుల నియంతృత్వ పాలనపై అలుపులేకుండా పోరాడిన పౌరహక్కుల న్యాయవాది కెజి కన్నబిరాన్ (1929–2010) అధికరణ 51–ఎ గురించి తన ఆత్మకథాత్మక సామాజిక చిత్రం '24 గంటలు'లో చెప్పిన విషయాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవలసిన అవసరముంది. ఆయన ఇలా రాశారు: 'రాజ్యాంగంలోకి మీరు ఒకవైపు బాధ్యతలు ప్రవేశపెట్టి, మరోవైపు సోషలిజం ప్రవేశపెట్టారంటే ఇవి రెండూ కలిస్తే నేషనల్ సోషలిజం అవుతుంది అని నేనన్నాను. నేషనల్ సోషలిజం అంటే నాజీజం. హిట్లర్ అధికారాన్ని కైవసం చేసుకోవడానికి ఉపయోగించిన నినాదం అది. దాన్ని అవలంబించడం అంత మంచిపనేమీ కాదు అని చెప్పాను'. ఆయన ఇంకా ఇలా రాశారు: సైద్ధాంతికంగా చూస్తే మీరు మీ ప్రాథమిక హక్కులను వినియోగిస్తున్నారంటే, ఇతరులు వారి ప్రాథమిక హక్కులు అనుభవించడానికి బాధ్యత పడుతున్నారన్నమాట. అంటే ఇతరుల హక్కుల పరిరక్షణ మీ బాధ్యత అవుతుంది. హక్కులకూ బాధ్యతలకూ మధ్య సంబంధాన్ని ఇట్లా అర్థం చేసుకోవాలి. ఎమర్జెన్సీ నిర్బంధాల కేసులు వాదించే సందర్భంలో మళ్ళీ మళ్ళీ బైటపడిన విషయం ఏమంటే రాజ్యాంగంలోని హక్కుల ఆధారిత దృక్పథం క్రమక్రమంగా విచ్ఛిన్నమైపోయింది'.

# ఉద్యోగాలున్నా నియామకాలేవీ?




ఇటీవల ఒక వార్త నా దృష్టిని విశేషంగా ఆకట్టుకుంది. అది, తమిళనాడులో ఉద్యోగ సూచక కార్యాలయాలలో తమ పేర్లను నమోదు చేయించుకున్న వారి సంఖ్య! నమోదయిన మొత్తం ఉద్యోగార్థులు: 75,88,359. వీరిలో 18 ఏళ్ళ వయసు లోపువారు: 17,81,695బీ 19–23 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు: 16,14,582బీ 24–35 ఏళ్ళ మధ్య వయస్సు ఉన్నవారు: 28,60,359బీ 36–57 ఏళ్ళ మధ్య వయస్సున్న వారు 13,20,337బీ 58 ఏళ్ళకు మించిన వయస్సు ఉన్నవారు: 11,386. ఈ నిరుద్యోగ గణాంకాలు మిమ్ములను నిరుత్సాహపరచడం లేదూ? ఉపాధి, ఉద్యోగరహిత జీవితాల వాస్తవాలు మీ మనస్సులను కుంగదీయడం లేదూ? అభివృద్ధి చెందిన రాష్ట్రమని సహేతుకంగా చెప్పగలిగే తమిళనాడులోనే పరిస్థితి ఇలా ఉంటే ఉత్తరప్రదేశ్, బిహార్‌ల మాటేమిటి? జనాభా సంఖ్యలో అగ్రగాములుగా ఉన్నా అభివృద్ధిలో అధోస్థానంలో ఉన్న ఆ రెండు ఉత్తరాది రాష్ట్రాలలో నిరుద్యోగుల సంఖ్యను మీరు ఊహించలేరేమో?! వారే గనుక తమ రాష్ట్రాలలోని ఉద్యోగ సూచక కార్యాలయాలలో పేర్లను నమోదు చేయించుకుంటే ఆ నిరుద్యోగుల నిజసంఖ్య మిమ్మలను నిరుత్తరులను చేస్తుంది సుమా! నిరుద్యోగులకు అవసరమైన ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయి? మన కళ్ళెదుటే నిగూఢంగా ఉన్నాయి! 2021 మార్చి 31న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న ఉద్యోగ ఖాళీలు 8,72,243. వీటిలో కేవలం 78,264 ఖాళీలను మాత్రమే ప్రభుత్వం భర్తీ చేసింది. దాదాపు 8 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఉద్యోగాలు మన కళ్ళెదుటే నిగూఢంగా ఉన్నాయని చెప్పాను. అవును. ఉద్యోగాలు సర్వత్రా ఉన్నాయి. అయితే వాటిని కనిపెట్టే ప్రయత్నం మనం చేయడం లేదు! హృద్రోగ చికిత్సలో అంతర్జాతీయంగా సుప్రసిద్ధుడు, ప్రతిష్ఠాత్మక 'నారాయణ' ఆసుపత్రుల వ్యవస్థాపకుడు డాక్టర్ దేవి శెట్టి ఇటీవల వెలువరించిన ఒక ప్రసంగాన్ని విన్నాను. అందులోని కొన్ని భాగాలను ఈ సందర్భంగా సముచితంగా ఉటంకిస్తాను. 'మన దేశంలో అండర్ –గ్రాడ్యుయేషన్, పోస్ట్ –గ్రాడ్యుయేషన్ సీట్లలో తీవ్ర కొరత ఉందని డాక్టర్ దేవి శెట్టి పేర్కొన్నారు. ఆయన ఇంకా ఇలా చెప్పారు: 'కరేబియన్ దేశాలకు వెళ్ళండి. అక్కడ 35 వైద్య కళాశాలలు అమెరికాకు అవసరమైన వైద్యులను సమకూర్చేందుకై యువ డాక్టర్లకు శిక్షణ ఇస్తున్నాయి. ఒక షాపింగ్ మాల్‌లో 50,000 చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని అద్దెకు తీసుకుని అద్భుతమైన డాక్టర్లను రూపొందిస్తున్నారు. మరి మనం ఒక్కో వైద్యకళాశాలకు రూ. 400 కోట్లు వినియోగిస్తున్నాం! ఎంత హాస్యాస్పదం! 100 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు వైద్య కళాశాలలకు 140 మంది అధ్యాపకులు అవసరం లేదు. 140 మంది అధ్యాపకులతో 1000 మంది విద్యార్థులు గల ఒక వైద్య కళాశాలను నడపవచ్చు. యావత్ప్రపంచం మారిపోయినా మనం మారలేదు'. డాక్టర్ దేవి శెట్టి తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు: 'ప్రతి 12 నిమిషాలకు ఒక ప్రసూతి మరణం ఎందుకు సంభవిస్తుంది? మూడు లక్షల మంది బాలలు పుట్టిన రోజునే ఎందుకు చనిపోతున్నారు? పన్నెండు లక్షల మంది బాలలు తమ మొదటి పుట్టిన రోజుకు ముందే ఎందుకు చనిపోతున్నారు? ఈ పరిస్థితి ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. మనకు రెండు లక్షల మంది గైనకాలజిస్టులు అవసరముంది. అయితే ప్రస్తుతం యాభై వేల కంటే తక్కువ మంది మాత్రమే ఉన్నారు. వీరిలో కూడా సగం మంది ప్రసూతి వైద్యం తెలియనివారే. అలాగే మనకు రెండు లక్షల మంది అనెస్థిటిస్ట్ (శస్త్రచికిత్సలో మత్తును కలిగించే ప్రక్రియను నిర్వహించే వ్యక్తి)లు అవసరం కాగా యాభై వేల కంటే తక్కువ మంది మాత్రమే ఉన్నారు. శిశు వైద్య నిపుణులు రెండు లక్షల మంది అవసరమయితే వారు యాభై వేల కంటే తక్కువ మంది మాత్రమే ఉన్నారు. వికిరణ చికిత్సా నిపుణులు (రేడియాలజిస్ట్స్) కనీసం 1,50,000 మంది అవసరం కాగా ఉన్నవారు 10,500 మంది మాత్రమే'. వైద్య, నర్సింగ్, పారా మెడికల్ విద్యను విముక్తపరచవలసిన అవసరం ఈ దేశానికి ఎంతైనా ఉంది'. ఒక చిన్నపాటి ప్రయత్నంతో ఆరోగ్యభద్రతా రంగంలో వేలాది ఉద్యోగాలను సృష్టించవచ్చని డాక్టర్ దేవి శెట్టి పేర్కొన్నారు. ఇదే తర్కాన్ని విద్య, పట్టణాభివృద్ధి, నదులు, జలవనరులు, అడవుల పెంపకం, పశు గణాభివృద్ధి, వ్యవసాయ పరిశోధన, విస్తరణ, ఆహార ప్రాసెసింగ్ మొదలైన రంగాలకు కూడా వర్తింపచేయండి. లక్షలాది ఉద్యోగాలను సృష్టించడం సుసాధ్యమవుతుంది. ఆ ఉద్యోగాలు తిరిగి మరెన్నో లక్షలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని కల్పిస్తాయి. 'మనం మహా స్మారక కట్టడాలను నిర్మిస్తున్నామే గానీ స్వయం సమృద్ధ వైద్య కళాశాలలను అభివృద్ధిపరచడం లేదని డాక్టర్ దేవి శెట్టి నిశితంగా విమర్శించారు. సరైన సదుపాయాలు కొరవడి, అవసరమైన చికిత్స సకాలంలో అందకపోవడం వల్లే చాలా మంది మహిళలు, శిశువులు చనిపోవడం జరుగుతోంది. ప్రభుత్వాలు ఉదారంగా వ్యవహరించడం లేదు. ప్రజల హక్కులను కాపాడటం లేదు ప్రభుత్వాలు చేస్తున్న వ్యయాలు ఏ రంగంలోనూ సహేతుకంగా ఉండడం లేదు. ప్రస్తుత సువ్యవస్థిత మార్గాలకు భిన్నంగా కొత్త మార్గాలలో పయనించే సాహసికులు ప్రభవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కరేబియన్ దేశాలలో వలే 'షాపింగ్ మాల్స్‌లో 50 వేల చదరపు అడుగుల వైశాల్యంలో వైద్యకళాశాలను మనమూ నడపగలగాలి' అని డాక్టర్ దేవి శెట్టి అన్నారు. ఉద్యోగాలు! ఉద్యోగాలు!! ఇవే వర్తమాన భారతదేశ అత్యంత ముఖ్యావసరం అనడంలో మరో మాట లేదు. నేను ప్రస్తావించిన వివిధ రంగాలకు లక్షలాది ఉద్యోగాలను సృష్టించగల సామర్థ్యమున్నది. ఉపాధ్యాయులు, లైబ్రేరియన్లు, లలితకళల బోధకులు, వృత్తికళల నిపుణులు, కోచ్‌లు, ల్యాబ్ టెక్నీయన్లు, డిజైనర్లు, వాస్తుశిల్పులు, పట్టణ ప్రణాళికాకర్తలు, ఇంజనీర్లు, అడవులు పరిరక్షకులు, పాల ఉత్పత్తిదారులు, పౌల్ట్రీ వ్యవసాయదారులు. ఇలా కొన్ని వందల విభాగాలలో లక్షలాది ఉద్యోగాలను సృష్టించగల శక్తి సామర్థ్యాలు ఆయా రంగాలకు ఉన్నాయి. ముఖ్యంగా చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలు చాలా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించగలవు. తత్ఫలితంగా ఆదాయాలు పెరుగుతాయి. సంపద సంచితమవుతుంది. ప్రభుత్వాలకు పన్ను రాబడి పెరుగుతుంది. పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ మిక్కుటమవుతుంది. దాతృత్వ కార్యకలాపాలు పుంజుకుంటాయి. సాహిత్య, కళారంగాలకు ఆదరణ అధికమవుతుంది. మరి ఉద్యోగాల సృష్టి గురించి ఆలోచించేదెవరు? కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ విషయమై దృష్టి పెట్టిందా? లేదు. ఆ మంత్రిత్వ శాఖ కార్యాలయాల వెలుపల ఉద్యోగాల సృష్టికి ఒక గొప్ప అవకాశం వేచి ఉన్నది. దానిని మనం కనిపెట్టి సద్వినియోగం చేసుకోవాలి. సరే, నరేంద్ర మోదీ ప్రభుత్వం 2022–23 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను సమర్పించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ అయినా ఉద్యోగాల సృష్టి గురించి ఆలోచిస్తుందా? ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 90 నిమిషాల పాటు వెలువరించిన 157 పేరాల బడ్జెట్ ప్రసంగంలో 'ఉద్యోగాలు' అనే మాట కేవలం మూడు చోట్ల మాత్రమే ప్రస్తావితమయింది!

# 'క్రిప్టో'తో కొత్త సవాళ్లు

ఒకప్పుడు కంప్యూటర్ వస్తే ఉద్యోగాలు పోతాయన్నారు. ఇప్పుడు అదే కంప్యూటర్ లక్షల ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఒకప్పుడు ఇంటర్‌నెట్ వస్తే పెద్దగా వర్కవుట్ కాదన్నారు. కానీ ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలోనూ ఇంటర్‌నెట్ అందుబాటులో ఉంది. డిజిటల్ పేమెంట్స్ వచ్చినప్పుడు ఇండియాలో కష్టమన్నారు. కానీ ఇప్పుడు ఆ సదుపాయం లేకుంటేనే కష్టమంటున్నారు. థియేటర్లను తలదన్నేలా ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ వచ్చేశాయి. టెక్నాలజీ ఎదుగుతూ విస్తరిస్తూ ఉంటే దానిని అందిపుచ్చుకుని, అలవాటుపడాలి. ఇప్పుడు మన ముందుకు మరో కొత్త వ్యవహారం వస్తోంది. పూర్తిగా కొత్తది కాకపోయినా, అందరికీ అంతగా తెలియనిది. డిజిటల్ కరెన్సీ ఇప్పుడు మరో ప్రపంచాన్ని చూపించబోతోంది. ఇల్లు ఉండదు. ప్రాపర్టీ ఉండదు. బ్యాంకులో బ్యాలెన్స్ ఉండదు. చేతిలో క్యాష్ ఉండదు. అయినా రిచ్ పర్సన్స్ గా గుర్తింపు పొందేవాళ్లు రాబోతున్నారు. వారి దగ్గర ఉండేది డిజిటల్ కరెన్సీ. డిజిటల్ రూపాయిని మన కేంద్రప్రభుత్వం ఎకానమీ లోకి ప్రవేశపెట్టబోతున్నది. పైగా క్రిప్టో కరెన్సీ ట్రాన్సాక్షన్స్ మీద 30 శాతం పన్ను విధించబోతున్నట్టు ఆర్థికమంత్రి వెల్లడించారు. ఒకప్పుడు మన దగ్గర క్రిప్టో కరెన్సీ మీద నిషేధం ఉంది. తర్వాత మెల్లగా నిషేధం ఎత్తేశారు. ఎందుకంటే అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రిప్టో ట్రాన్సాక్షన్స్‌ను నియంత్రించలేమని అర్థమైంది. క్రిప్టో చెలామణీ వ్యవహారాలపై కొత్తగా పన్ను విధించారు. అంటే నేరుగా చెప్పకపోయినా క్రిప్టో కరెన్సీకి గేట్లు ఎత్తినట్లే. ఇప్పటికే లక్షల మంది క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడుతున్నారు. బిట్ కాయిన్ లాంటివి అందరికీ ఇప్పుడు తెలిసిపోయాయి. అంతర్జాతీయంగా సంక్షోభం వచ్చినప్పుడు స్టాక్ వాల్యూస్ దారుణంగా పడిపోయాయి. అప్పుడు పెట్టుబడులు ఎక్కడ పెట్టాలో అర్థం కాక అయోమయంలో ఉన్నవారికి క్రిప్టో కరెన్సీ ప్రత్యామ్నాయంగా కనపడింది. ఎలాన్ మస్క్ లాంటి టెక్ జెయింట్స్ కూడా దానిని ప్రోత్సహించారు. ఇప్పుడు క్రిప్టో కరెన్సీ స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు పోటీదారుగా ఎదుగుతోంది. ఇప్పటికే మన భారత ఇన్వెస్టర్లు మూడు లక్షల కోట్లు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. అయితే క్రిప్టో కరెన్సీ విపరీతంగా పెరిగిపోయినా ప్రమాదమే. సరైన నియంత్రణలు లేకపోతే ఘోరంగా నష్టపోతాం కూడా. అందుకే కొత్తగా వచ్చిన ఈ టెక్ బేస్డ్ మోడల్‌ను అడాప్ట్ చేసుకుంటూనే దానిని మనకు ఉపయోగకరంగా చేసుకోవాలి. దీని కోసం భారత ప్రభుత్వం క్రిప్టో కరెన్సీ వాడుతున్న ఇతర దేశాలతో సమన్వయంతో వ్యవహరించాల్సి ఉంటుంది. ఇతర దేశాలతో కలిసి ఒక అంతర్జాతీయ క్రిప్టో నిర్వహణ విధానం తీసుకువచ్చి క్రిప్టో కరెన్సీ కదలికలపై నియంత్రణ పెంచుకోవాలి. ఆ ట్రాన్సాక్షన్స్‌కి సరైన



జవాబుదారీతనం ఉండేలా చూసుకుని ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేసుకోవాలి. రేపు ప్రపంచమంతా డిజిటల్ కరెన్సీ వైపు వెళ్లినా ఇబ్బంది లేకుండా ప్రభుత్వం సైతం దానిని వాడగలిగే సిస్టమ్స్‌ను, మెకానిజమ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇన్వెస్టర్లు కూడా క్రిప్టో కరెన్సీ గురించి సరైన అధ్యయనం చేయాలి. క్రిప్టోలో వచ్చిన కొత్త ప్రమాదం ఏమిటంటే, అందులోనూ డూప్లికేట్ కరెన్సీలు వస్తాయి. ఎవరికివారు సొంతంగా క్రిప్టో కరెన్సీ సృష్టించి ఆన్‌లైన్‌లో పెట్టేస్తున్నారు. అలాంటివి కొనుక్కుని చాలామంది నష్టపోతున్నారు. అలా కాకుండా దీనికో ఆమోదయోగ్యమైన రెగ్యులరైజేషన్ ప్రాసెస్ పెట్టాలి. పాలసీకి సంబంధించిన నిబంధనలు పాటించేవారికి మాత్రమే అవకాశం ఇవ్వాలి. అప్పుడు మాత్రమే డూప్లికేట్ వ్యవహారాలకు బ్రేక్ పడుతుంది. ఇన్వెస్టర్లు నష్టపోకుండా ఉంటారు. మొత్తం మీద ప్రభుత్వం క్రిప్టో కరెన్సీ కదలికల్ని అదుపు చేస్తూ దానిపై తన పట్టు పెంచుకుంటూ నిర్దిష్టమైన, ఖచ్చితమైన విధానాలతో ఆదాయం కూడా వచ్చేలా చూసుకుంటే అటు ఇన్వెస్టర్లకు ఇటు ప్రభుత్వానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

# ఇంటి వద్దకే దూరవిద్య

**ఇగ్నో యూనివర్శిటీ అసిస్టెంట్ రీజినల్ డైరక్టర్ డా.సౌజన్య**







హైదరాబాద్ ఫిబ్రవరి 19 ప్రజాపాలన ప్రతినిధి: ఇంటి వద్దకే దూరవిద్య అందుబాటులో ఉందని ఇగ్నో యూనివర్శిటీ అసిస్టెంట్ రీజినల్ డైరక్టర్ డా.సౌజన్య అన్నారు.జాతీయ స్వచ్ఛంద సంస్థల ఫోరం ఆధ్వర్యంలో సూర్యలోక్ కాంప్లెక్స్ హైద్రాబాద్ లో జరిగిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎన్జీవోలు ఉన్నత విద్యను అభ్యసించినట్లైతే మరింత ఉత్తేజవంతంగా తమ సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. అనంతరం అతిథులుగా హాజరైన జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థల నెట్ వర్క్ ఫోరమ్ అధ్యక్షుడు మరియు అంబేద్కర్ టీవీ ఛానల్ డైరెక్టర్ కోఆర్డినేషన్ ఆరెపల్లి రాజేందర్ మాట్లాడుతూ ఇగ్నో యూనివర్శిటీ అందిస్తున్న దూర విద్యావిధానంలో ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన ఎన్జీవోలు బీఏ కోర్సుతో పాటూ సర్టిఫికెట్ మరియు డిప్లోమా కోర్సులను ఉచితంగానే చేసే వీలుందని అన్నారు. దాదాపూ 40 కోర్సులను ఎస్సీ ఎస్టీ వర్గాల వారు ఎవరైనా ఉచితంగానే అభ్యసించే వీలుందని అన్నారు. ఈ సదస్సులో దాదాపు 50 స్వచ్ఛంద సంస్థలు మరియు పలువురు విద్యావేత్తలు, మేధావులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఇగ్నో యూనివర్సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వలుసా సుభాష్ చంద్రబోస్, ప్రధాన కార్యదర్శి బెల్లం మాధవి,మరో వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వాణి, అడ్వైజర్ బాలకృష్ణతో పాటూ మంజుల, సమీరా తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 19 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల్ మండల్ పరిధిలోని బోడకొండ గ్రామం లో సేవాలాల్ జయంతి ఉత్సవాల కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచాల మండల జడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి, ఎంపీపీ నర్మద అచ్చిరం, ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ ఆర్ టి ఓ ఆఫీస్ లో డబ్బుల కోసం గొడవ



వికారాబాద్ బ్యూరో 19 ఫిబ్రవరి ప్రజాపాలన : వికారాబాద్ రోడ్డు రవాణా శాఖ కార్యాలయం (ఆర్టీఓ ఆఫీస్ ) లో డబ్బుల కోసం ఏజెంట్, హొంగార్డు గొడవ పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వికారాబాద్ ఆర్టీఓ కార్యాలయానికి లారీ యజమాని ఫిట్నెస్ క్యాన్సిల్ చేసుకోవడానికి ఏజెంట్ ద్వారా వచ్చారు. ఆర్టీవో కార్యాలయంలో పనిచేస్తున్న హొంగార్డు సత్తయ్యకు ఏజెంట్ ఫయూమ్ కు ఈ మధ్యన డబ్బుల విషయంలో గొడవ జరిగింది. రూ 5000 ఇస్తే తప్ప ఫైలు సార్ దగ్గర పెట్టనని హొంగార్డు చెప్పడంతో ఇరువురు ఘర్షణపడ్డారు. ఒకరినొకరు చొక్కాలు పట్టుకుని కొట్టుకున్నారు. వికారాబాద్ ఆర్టీవో కార్యాలయంలో డబ్బులు డిమాండ్ చేస్తూ ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని ఏజెంట్ ఫయూమ్ ఆరోపించారు.

## కెవిపిఎస్ క్యాలెండర్ డైరీని ఆవిష్కరించిన:తాసిల్దార్ రావూరి రాధిక

**మహనీయుల చిత్రపటాల తో**
**క్యాలెండర్ డైరీని ముద్రించడం అభినందనీయం**



బోనకల్, ఫిబ్రవరి 19 ప్రజా పాలన ప్రతినిధి:సామాజిక ఉద్యమాల కరదీపిక 2022 కెవిపిఎస్ డైరీని బోనకల్ మండలం తాసిల్దార్ రావూరి రాధిక శనివారం తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ డైరీ లో భారత రాజ్యాంగం తో పాటు మానవ హక్కుల చట్టాలు ఉల్లంఘన మహిళల చట్టాలు తదితర సంస్కరణల పై అవగాహన కలిగే విధంగా కెవిపిఎస్ డైరీని ముద్రించడం అభినందనీయమని ఆమె అన్నారు. చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ చట్టాలను అమలు చేసే విధానంలో అధికారులు ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్వేత, ఆర్ఐ లక్ష్మణ్, వైయస్సార్ టిపి జిల్లా నాయకులు ఇరుగు జానేస్, బోనకల్ మండలం కెవిపిఎస్ అధ్యక్షులు మంద సత్యానందం,కార్యదర్శి గార్లపాటి రమేష్, ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయిలోనే రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

**వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్**



వికారాబాద్ బ్యూరో 19 ఫిబ్రవరి ప్రజాపాలన : మండల స్థాయిలోనే రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. శనివారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధరణి ఫోర్టల్ లో అందుబాటులో ఉన్న అన్ని ఆప్షన్స్ పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ ఆన్లైన్లో నమోదు చేసుకున్న వెంటనే తగిన సర్టిఫికెట్లు అన్నింటిని జతచేసి తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేయాలన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా వారి సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా, మండల స్థాయి లోనే వారికి అవగాహన కల్పించాలన్నారు. రెవేన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీడీవో విజయ కుమారి, మండల రెవెన్యూ అధికారులు షర్మిల, శ్రీనివాస్, తులసిరాం, రసూల్, భీమయ్య, డిటి భరత్, ఏఓ ఆర్ డి ఓ అమరేందర్ పాల్గొన్నారు.


# ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జన్మదిన వేడుకలు



మేడిపల్లి, ఫిబ్రవరి 19 (ప్రజాపాలన ప్రతినిధి) :చత్రపతి శివాజీ మహారాజ్ జన్మదిన వేడుకలను రామంతాపూర్లో శివాజీ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తిండేరు హనుమంతరావు ఆధ్వర్యంలో చెన్నోజు హరీష్ అధ్యక్షతనలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకట్ రెడ్డి ,హైదరాబాద్ సెంట్రల్ సిటీ జిల్లా అధ్యక్షులు గౌతమ్ రావు, అధికారప్రతినిధి ఏడెల్లి అజయ్ కుమార్ ,ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి వేములకొండ సోమశేఖర్ గౌడ్ మరియు కార్పొరేటర్లు చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకట్ రావు, బాగ్ అంబర్పేట్ కార్పొరేటర్ పద్మ వెంకట్ రెడ్డి మరియు వివిధ పార్టీల నాయకులు పాల్గొని క్రూరమైన మొగలుల పాలన అంతమొందించి, హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించిన చత్రపతి శివాజీని సమాజంలోని నేటి యువత ఆదర్శంగా తీసుకుని హిందూ ధర్మ రక్షణ కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మా సంస్థతోపాటు రక్తదాన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తధాన శిభిరంలో సుమారు 50 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఓబుల్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్ యాదవ్, ఉపాధ్యక్షులు చెక్క శ్రీనివాస్, కొత్తపల్లి రమేష్, సోమ శ్రీనివాస్ గుప్తా, సాయినాథ్, జగదీష్, జిల్లా శ్రీనివాస్, అంజయ్య పటేల్, నాగరాజు, యాదగిరి సాగర్, కులకర్ణి, మరియు వివిధ ప్రాంతాల నుండి హిందూ బంధువులు ఊరేగింపులుగా శోభాయాత్ర లు నిర్వహించి డప్పు చప్పుళ్ళతో కాషాయపు జెండాలతో తరలివచ్చి శివాజీ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.

## రంగా హనుమంతరావు నివాసానికి వచ్చిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ కొండబాల





మధిర ఫిబ్రవరి 19 ప్రజాపాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధిలో ప్రముఖ పారిశ్రామికవేత్త కాంగ్రెస్ నాయకులుమాజీ మార్కెట్లు యాడ్ చైర్మన్ పట్టణ ప్రముఖులు రంగా హనుమంతరావు కుమారుడు నిన్న రాత్రిరాఘవ్ వివాహాన్ని పురస్కరించుకుని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ఈరోజు రంగా వెంకటేశ్వర్లు హనుమంత రావు ముందుగానివాసానికి వచ్చి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు వారితో పాటు టిఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షుడు రావూరి శ్రీనివాస రావు కనుమూరి వెంకటేశ్వరావురు కనీవినీ ఎరుగని రీతిలో భారీ సెట్టింగులతో ఫంక్షన్ హాల్ లో తేనీటి విందు తో రంగా వర్సెస్ కొన్నవారికి పెళ్లి సందర్భంగా గా శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కాంగ్రెటస్ నాయకులు వారి కుమారుడు నూతన వధూవరులకు ఆశీర్వదించిన ప్రముఖుల్ను మాజీ పార్లమెంట్ సభ్యుల్ను పొంగులేటి శ్రీనివ్షాస రెడ్డి పార్లమెంట్ సభ్యులు నామ్షా నాగేశ్వరరావు జడ్పీ చైర్మన్ లింగాలకమల్ రాజుకాంగ్రెస్ నాయకులు మల్లు భట్టి విక్రమార్క నందిని డిసిసి ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ జిల్లా ఆర్యవైశ్యులు మధిర మండల ఆర్యవైశ్యులుఅదేవిధంగా జిల్లాలో ఉన్న వివిధ హొదాల్లో మండల పరిధిలో రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు విలేకరులుఅన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపినారు

## వికారాబాద్ ఆర్ టి ఓ ఆఫీస్ లో డబ్బుల కోసం గొడవ

వికారాబాద్ బ్యూరో 19 ఫిబ్రవరి ప్రజాపాలన : వికారాబాద్ రోడ్డు రవాణా శాఖ కార్యాలయం (ఆర్టీఓ ఆఫీస్ ) లో డబ్బుల కోసం ఏజెంట్, హొంగార్డు గొడవ పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వికారాబాద్ ఆర్టీఓ కార్యాలయానికి లారీ యజమాని ఫిట్నెస్ క్యాన్సిల్ చేసుకోవడానికి ఏజెంట్ ద్వారా వచ్చారు. ఆర్టీవో కార్యాలయంలో పనిచేస్తున్న హొంగార్డు సత్తయ్యకు ఏజెంట్ ఫయూమ్ కు ఈ మధ్యన డబ్బుల విషయంలో గొడవ జరిగింది. రూ 5000 ఇస్తే తప్ప ఫైలు సార్ దగ్గర పెట్టనని హొంగార్డు చెప్పడంతో ఇరువురు ఘర్షణపడ్డారు. ఒకరినొకరు చొక్కాలు పట్టుకుని కొట్టుకున్నారు. వికారాబాద్ ఆర్టీవో కార్యాలయంలో డబ్బులు డిమాండ్ చేస్తూ ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని ఏజెంట్ ఫయూమ్ ఆరోపించారు.

## అమ్మవార్లకు ఘన వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

సింగ్ పాటిల్. మంత్రులు, పోలీసులతో పాటు జిల్లాలోని అన్ని శాఖలు బాగా సహకరించాయన్నారు. మేడారంలో కన్నెపల్లి సారలమ్మ పూజారులు ఆందోళనకు దిగారు. పోలీసులు తమను కొట్టారని రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెట్టి ధర్నా చేశారు. పోలీసు ఉన్నతాధికారులు వచ్చి మాట్లాడటంతో ఆందోళన విరమించారు. ఆఖరిరోజు భక్తులు పోటెత్తారు. అమ్మవార్లకు చీరె, సారెలు, బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివసత్తుల పూనకాలు, ఒగ్గుడోలు నృత్యాలు, తీన్మార్ స్టెప్పులతో అడవంతా మార్మోగింది. ఆదివాసీలు, గిరిజనుల డ్యాన్స్ లు అందరిని ఆకట్టుకున్నాయి.. ఇక...అధికారుల తీరుపై ఆగ్రహ వ్యక్తం చేశారు గవర్నర్ తమిళిసై. సీఎం, పీఎం మేడారం ఎందుకు రాలేదన్నారు రేవంత్ రెడ్డి. జాతర సక్సెస్ కోసం అవమానాలు భరించానన్నారు సీతక్క.

# చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు



తాండూరు ప్రజా పాలన ప్రతినిధి : తాండూరు పట్టణంలో చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా సభ్యులు తాండూర్ శాసనసభ్యులు పైలట్ రోహిత్ రెడ్డి తాండూర్ కాళికా దేవి దేవాలయంలో పూజలు నిర్వహించి ర్యాలీని వైభవంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ర్యాలీ కాళికా దేవి దేవాలయం నుండి శివాజీ ద్వారా బయలుదేరింది ర్యాలీలో శాసనసభ్యులు పి రోహిత్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ స్వప్న వైస్ చైర్మన్ దీపా నర్సింలు అవసరాలు బిజెపి నాయకులు రమేష్ మా బిజెపి కాంగ్రెస్ టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు ప్రజలు కార్యకర్తలు భక్తులు అధిక సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి ఊరేగింపుగా ఎక్కువగా శివాజీ విగ్రహం వరకు ర్యాలీ తీశారు ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు పోలీస్ స్టేషన్ చౌరస్తా నుండి ర్యాలీగా బయలుదేరి కొరకు వెళ్లి విగ్రహం దగ్గరకు వెళ్ళింది ఈ ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డిఎస్పీ లక్ష్మీనారాయణ టి రాజేందర్ రెడ్డి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కట్ట మైసమ్మతల్లికి పూజలు చేసిన నంబూరి మోహన్ రావు




తల్లాడ, ఫిబ్రవరి 19 (ప్రజాపాలన న్యూస్): తల్లాడ మండలంలోని గాంధీ నగర్ తండా గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ తల్లికి తల్లాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నంబూరి మోహన్ రావు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తల్లాడ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు నంబూరి నారాయణరావు, నంబూరి మోహన్ రావు సోదరులు సొంత ఖర్చులతో ఈ దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయంలో కట్ట మైసమ్మ తల్లిని ఈనెల 20వ తేదీన ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. అంతేకాకుండా 21వ తేదీన అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా సిద్ధాంతి చిట్టోజు రామాచారి పూజారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని మామిడి తోటలో ఈ దేవాలయాన్ని సుందరంగా ముస్తాబు చేసి అలంకరించారు. ఈ సందర్భంగా నంబూరి మోహన్ రావు మాట్లాడుతూ అమ్మవారి ఊరేగింపు, విగ్రహ ప్రతిష్టకు ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి హరీష్, పూజారులు సాగర్, ధనుంజయ్, నాగరాజు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ టిపిని గడపగడపకు చేర్చాలి

**జిల్లా వైఎస్ఆర్ టిపి మహిళా కన్వీనర్ పి. సుధారాణి**



వికారాబాద్ బ్యూరో 19 ఫిబ్రవరి ప్రజాపాలన : వైఎస్సార్ టిపీని గడపగడపకు చేర్చాలని వికారాబాద్ జిల్లా వైఎస్సార్ టిపీ మహిళా కన్వీనర్ పి సుధారాణి పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాదులోని ఎల్బీనగర్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యకర్తలను చైతన్యవంతం చేసి పార్టీ ప్రతిష్టకు కృషి చేస్తామని వివరించారు. జిల్లా పరిధిలోని మహిళలు అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ ప్రతిష్టను ఇనుమడింప చేస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు సమావేశంలో జిల్లా వైఎస్ఆర్ టిపి మహిళా కన్వీనర్ పి.సుధారాణిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్ బినగర్ నియోజకవర్గం మామిడి రాంచందర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, అజయ్, వాసు, శ్రవణ్, యాదయ్య, జోసెఫ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## భరోసా సెంటర్ లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగం: జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి



వికారాబాద్ బ్యూరో 19 ఫిబ్రవరి ప్రజాపాలన : వికారాబాద్ జిల్లా భరోసా సెంటర్ లో కాంట్రాక్ట్ ప్రాతిపదిక పద్ధతిపై పని చేయుటకు 3 ఖాళీలు ఉన్నాయని జిల్లా ఎస్పీ ఎన్ కోటి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు గాను అర్హత గల ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు జిల్లా పోలీస్ కార్యలయం నందు తేదీ: 22.02.2022 సాయంత్రం 5.00 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్పి సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా ఎస్పి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

# మధిర మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాలలో జిల్లా కలెక్టర్



మధిర ఫిబ్రవరి 19 ప్రజా పాలన ప్రతినిది : మధిర మున్సిపాలిటీ పరిధిలో శనివారం నాడు జిల్లా కలెక్టర్ మధిర మున్సిపాలిటీ లో బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కలెక్టర్ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం చైర్పర్సన్ మొండితోక లత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గౌతం హాజరయ్యారు20 22 -23 ఆర్థిక సంవత్సరానికి 11 కోట్ల 78 లక్షల 77 రూపాయలతో రూపొందించారు2021-22 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ 11 కోట్ల తొంబై ఆరు లక్షల 95 వేల రూపాయలతో అంచనాలు రూపొందించారు అంచనాల బడ్జెట్లో జనవరి 31 నాటికి 6 కోట్ల 44 లక్షల 77 వేల రూపాయలు ఖర్చు చేశారు. సమావేశంలో కౌన్సిలర్ కట్టా గాంధీ మాట్లాడుతూ రైల్వే మూడో లైన్ కోసం చేపట్టిన భూసర్వే అస్తవ్యస్తంగా ఉన్నదని, రెవెన్యూ అధికారులు, రైల్వే అధికారులు కలిసి పేదలకు నష్టం జరక్కుండా భూసేకరణ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు మార్కెట్ యార్డ్ రోడ్డులో నివాసం ఉంటున్న పేదలందరికీ ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీవో ప్రకారం రెగ్యులైజేషన్ చేయాలని కట్టా గాంధీ కోరారు.మెయిన్ రోడ్ లో బడ్డీకొట్టు ద్వారా వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కట్టా గాంధీ కోరారు.మెయిన్ రోడ్లో టి వి యం పాఠశాల వద్ద శిథిలావస్థకు చేరిన మున్సిపల్ భవనాలను తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని కౌన్సిలర్ కోనా ధని కుమార్ కోరారు. అనంతరం మున్సిపల్ ఆఫీస్ లో చెత్త ట్రాక్టర్ ను ప్రారంభించారు అనంతరం చిరు వ్యాపారసంఘ ఎప్పుడ్నునుంచో జీవనాధారం చేసుకుంటున్నా బడ్డీ కొట్లు తీసేసి మినీ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు అనంతరంం తాసిల్దార్ వెళ్లి కార్యాలయంలో ఉద్యోగస్తులు పలకరించి పరిశీలించి వెంటనే కలెక్టర్ స్పందించి స్పందిస్తూ ఆదాయ మార్గాలు పెంచుకునేందుకు తప్పనిసరిగా నూతన భవనాలు నిర్మించాలని ఆయన సూచించారు సమావేశం లో కమిషనర్ అంబటి రమాదేవి టిపిఓ భాస్కర్ ఇతర అధికారులు ల్గొ తాసిల్దార్ రాజేష్ ఆర్ ఐ జై కృష్ణ కౌన్సిలర్ కమిషనర్ రమాదేవి చైర్ పర్సన లత వార్డ్ కౌన్సిలర్ అప్పారావు మాధవి రజిని కట్ట గాంధీ ధరణి కుమార్ వంకాయల ప్లాటి నాగేశ్వరావు మేడికొండ కళ్యాణి వైస్ చైర్మన్ విద్యా లత మునుగోట వెంకటేశ్వరావు వార్డు కౌన్సిలర్ అధికారులు చిరు వ్యాపార సంఘ సభ్యులు పాల్గొన్నారు

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



కొడిమ్యాల, ఫిబ్రవరి 19 (ప్రజాపాలన ప్రతినిధి): కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామ పంచాయతీ ఆవరణలో చత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం మాట్లాడుతూ శివాజీ మొగలులను సామ్రాజ్యాన్ని ఎదిరించి పశ్చిమాన మరాఠీ సామ్రాజ్యాన్ని స్థాపించిన యోధుడుని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊటుకూరి రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ ఉట్కూరి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ గుంటి ఎల్లయ్య, యువజన సంఘం ప్రతినిధులు మందల గోపాల్ రెడ్డి, ఉరగొండ తిరుపతిరావు, రాజేందర్, మనోజ్ రెడ్డి, సతీష్, విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణ వర్ధన్ రెడ్డి, జలంధర్, శేఖర్, శివ, మహేష్, గణేష్, కళ్యాణ్, పోచ మల్లు, శ్రీను, మల్లేశం, శంకర్, సత్తయ్య, మైపాల్ ,గంగాధర్, పాల్గొన్నారు.

## మండలంలో ఛత్రపతి శివాజీ జయంతి సంబరాలు

**మండల బిజేపి అధ్యక్షుడు గోలి చందు**



జన్నారం రూరల్, పి బ్రవరి 19, ప్రజాపాలన: మండల కేంద్రం హిందూ వాహిని కమిటి అదర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో శివాజీ జయంతి వేడుకల శోబా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల బిజేపి పార్టీ అధ్యక్షుడు గోలి చందు , నాయకులు ఎరుకల రమేష్ గౌడ్, శీదర్, బూర్రగడ్డ జగన్, నాగరాజు, రమేష్, బద్రి, ముదేళ్లా శంకర్, పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ నగర్ చౌరస్తాలో పెడేస్ట్రియన్ లైన్ లు, సిగ్నల్ ను ఏర్పాటు చేయండి

**ఆలిండియా ఎస్ సి,ఎస్ టి ఐక్య వేదిక తెలంగాణ అధ్యక్షుడు భరత్ సింగ్**



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) : విద్యార్థులకు,వృద్ధులకు రోడ్డు దాటేటప్పుడు అత్యంత ఇబ్బందిగా మారిన ఎస్ ఆర్ నగర్ చౌరస్తా లో (ఉమేష్ చంద్ర విగ్రహం ముందు) జీబ్రా లైన్లు,సిగ్నల్ ను,పెడెస్ట్రియన్ లైన్ లు ఏర్పాటు చేయాలని, కాలేజిలు అధికంగా ఉన్న ప్రదేశం కావడంతో విద్యార్థులకు,వయో వృద్ధులకు రోడ్డు దాటాలంటే కష్టంగా మారిందని అన్నారు ఆలిండియా ఎస్ సి,ఎస్ టి ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర యువత అధ్యక్షుడు దేవావత్ భరత్ సింగ్.ఈ విషయానికి సంబంధించి జాయింట్ కమీషనర్ ట్రాఫిక్ ఏ వి రంగనాధ్ ని,అమీర్ పేట్ సి ఐ శ్రేయని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ చోట చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని కూకట్ పల్లి లో ఏర్పరచిన విధంగా పాదచారులు దాటేందుకు వీలుగా సిగ్నల్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు ఐక్య వేదిక నాయకులు రాకేష్ నాయక్, రాజేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్**



వికారాబాద్ బ్యూరో 19 ఫిబ్రవరి ప్రజాపాలన : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి అని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ సెలక్షన్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో క్రీడారంగానికి ప్రాధాన్యతను కల్పిస్తుందని, రాష్ట్ర స్థాయి మరియు జిల్లాస్థాయి క్రీడల్లో నైపుణ్యవంతమైన క్రీడలను తయారు చేయాలన్నారు. విద్యార్థి దశనుండే పాఠశాలల్లో క్రీడలను పరిచయం చేస్తూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలన్నారు. క్రీడలలో గెలుపు ఓటములను స్నేహపూర్వకంగా స్పోర్టివ్ గా తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షూటింగ్ బాల్ అధ్యక్షుడు పెద్దింటి నవీన్ కుమార్, రాష్ట్ర షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారిగా ఎం సోమశేఖర్, ఉపాధ్యక్షుడుగా రామచంద్రుడు, సంయుక్త కార్యదర్శిగా హరిచరణ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రావినూతల అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏ సి డి పి ఓ



బోనకల్, ఫిబ్రవరి 19 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని రావినూతల గ్రామంలో మూడవ అంగన్వాడి కేంద్రాన్ని ఏ సి డి పి ఓ కమల ప్రియ పరిశీలించి నారు. మూడవ అంగన్వాడి సెంటర్ నందు గర్భిణి స్త్రీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గర్భిణీలకు పోషకాహారాలు సరైన క్రమంలో అందని కారణంగా శనివారం రావినూతల గ్రామంలో ఏ సి డి పి ఓ కమల ప్రియ, సూపర్వైజర్ జ్యోతి అంగన్వాడి సెంటర్ ను పరిశీలించడం జరిగింది. అంగన్వాడి సెంటర్ తోపాటు గర్భిణీ స్త్రీల ఇంటి వద్దకు వెళ్లి అంగన్వాడి సెంటర్ లో సరైన పోషకాహారాలు అందుతున్నాయా లేదా అడిగి వివరాలు తెలుసుకున్నారు. దీనిపై అంగన్వాడీ టీచర్ గుర్రం పార్వతిని వివరాలు అడగ్గా ఆమె పొంతన లేని సమాధానాలు చెబుతూ చెబుతూ ఉండడంతో ఏ సి డి పి ఓ కమల ప్రియ రికార్డులు పరిశీలించగా అంగన్వాడి సెంటర్ లో రికార్డుల్లో పలు అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని అంగన్వాడీ టీచర్ గుర్రం పార్వతికి తెలియపరిచారు. మళ్లీ ఇలాంటి అవకతవకలు అంగన్వాడి సెంటర్ లో జరిగితే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.


# ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీంపట్నం | 9618028334 |
| భుక్య శ్రీను | బోనకల్ | 86881020885 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| పి.పండు | చేవేళ్ల | 9963293635 |
| గొల్లపూడి దశరధన్ | జిల్లేడు, చౌదరిగూడ | 9951334682 |
| పుప్పాల కిరణ్ కుమార్ | రాజేంద్రనగర్ | 9666603538 |


## యావత్ భారత జాతికే స్ఫూర్తి శిఖరం,భరత జాతి వీరయోధుడు ఛత్రపతిడ్శివాజీ మహరాజ్: వి.జగదీశ్వర్ గౌడ్



శేరిలింగంపల్లి -ప్రజా పాలన/ న్యూస్ :ఛత్రపతి శివాజీని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని హాఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని గంగారాం గ్రామంలో యూత్ నాయకులు మల్లికార్జున్ మరియు యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ 392వ జయంతి మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జెండాను ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించాన మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ . ఛత్రపతి శివాజీ మహారాజ్ భారతీయుల సంరక్షణకి అనేక యుద్ధాలు చేసిన మహావీరుడని,బడుగు బలహీన వర్గాల శ్రేయస్సుకు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు.నేటి యువత ఛత్రపతి శివాజీ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్ ముదిరాజ్,రవి కుమార్,యూత్ సభ్యులు రోహిత్,శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉత్తేజం



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి19( ప్రజాపాలన ప్రతినిధి): మండలంలోని వర్షంకొండ గ్రామంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉత్తేజం నేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు 33 మందికి సాయంకాలం సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున వారు ఆకలి తో వుంటే చదువు పై శ్రద్ద వుండదని అందుకు దాతల సహకారంతో స్నాక్స్ ఇస్తున్నట్టు ప్రధానోధ్యాయులు గడ్డం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పోనకంటి వెంకట్,ఉపసర్పంచ్ మంగిలిపెల్లి లక్ష్మణ్,ఉపాధ్యాయులు రాజేందర్,కృష్ణ ప్రసాద్, మురళి,తిరుమల,ఇబ్రహీం,భాగ్యలక్ష్మి లు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**నీల్వాయి పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసిన వేమనపల్లి దళిత సంఘం మండల కమిటీ నాయకులు**



బెల్లంపల్లి, ఫిబ్రవరి 19, ప్రజా పాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పై అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం దళిత సంఘం నాయకులు శనివారం నాడు నీల్వాయి పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 13న విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి, దళితులకు ఎలాంటి సంబంధం లేదని మాట్లాడడం జరిగిందని, దళితులమైన మేము భారత రాజ్యాంగానికి లోబడి, భారతదేశంలోనే బ్రతుకుతున్నా మని అలాంటి మాకు భారత రాజ్యాంగానికి సంబంధం లేదని మాట్లాడడం మమ్మల్ని అవమాన పరిచినట్లు గా భావించి నట్లు వారు తెలిపారు. అందుకే మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలానికి చెందిన దళితుల మైన మేము ఫిర్యాదు చేస్తున్నామని అన్నారు, గతంలో రాజ్యాంగాన్ని మార్చాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమాన పరచడం జరిగిందని, అలాగే దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూముఇల్లు, ఇస్తానని ఇవ్వకుండా, దళితుడిని ముఖ్యమంత్రి ని చేస్తాను అని చెప్పి చెయ్యకుండా, ప్రతిసారి దళితులను మోసం చేస్తున్నాడని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులను అవమానపరిచడమే కాకుండా, ఇచ్చిన హామీలను అమలు చేయనీ ముఖ్యమంత్రి పై చట్టపరమైన చర్యలు తీసుకొని అట్రాసిటీ కేసు నమోదు చేసి దళితుల మైన మాకు న్యాయం చేయాలని వారన్నారు.

## మల్లాపూర్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు



మల్లాపూర్, ఫిబ్రవరి 19 (ప్రజాపాలన ప్రతినిధి): మల్లాపూర్ మండలకేంద్రం ఉన్నతపాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పుస్తక పఠన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎర్రోజు అనిత, రికార్డ్ అసిస్టెంట్ బి.గంగాధర్, ఉపాధ్యాయులు స్వప్న గౌడ్, శ్రీనివాస్, రాజేందర్, మలన్, మంజుల, శ్రీదేవి, అనిత, గణేష్ మరియు విద్యార్థులు పలుగొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎన్. రాములు

## ఉన్నత పాఠశాల

1963 జూన్‌లో మల్టీపర్పస్ హైస్కూల్‌కు మారడం జరిగింది. తొమ్మిదో తరగతిలో ఎనిమిది సెక్షన్లు ఉండేవి. ఒకటో సెక్షన్ ఉర్దూ మీడియం ఉండేది. ముద్దు రామకృష్ణయ్య ప్రధానోపాధ్యాయుడుగా అప్పటికే బాగా ప్రాచుర్యం.

తొమ్మిదో తరగతిలో అనేకమంది కొత్తవాళ్ళు క్లాస్‌మేట్‌లు అయ్యారు. తాహసిల్‌దార్ కొడుకు అశోక్, పి.వి. నారాయణ సార్ కొడుకు జయప్రకాష్, శాంతి రాజమౌళి, సిహెచ్ రాజన్న తదితరులం క్లాస్‌లో చదువులో, మార్కుల్లో పోటీపడేవాళ్ళం.

తొమ్మిదో తరగతిలో చాలామంది కోరుట్ల, రాయికల్, మెట్‌పెల్లి నుండి చాలామంది మా స్కూల్లో జాయిన్ అయ్యారు. అక్కడ హెచ్‌ఎస్‌సి ఉండేది. హెచ్‌ఎస్‌సి తర్వాత పియుసి పాస్ కావాలి. జగిత్యాల మల్టీపర్పస్‌లో పియుసి లేకుండ పన్నెండో తరగతి ఒక్కటే బోర్డు పరీక్ష ఉండేది. రాయికల్ నుండి బొమ్మకంటి రాంగోపాల్, చెన్న అనంతం, చెన్న జగదీశ్వర్ తొమ్మిదో తరగతిలో జగిత్యాలలో జాయిన్ అయ్యారు. కోరుట్ల నుండి టి. రాజిరెడ్డి, అల్లె మనోహర్, పోతని నాగేందర్, గణేష్, కాసర్ల శంకర్ తదితరులు జాయిన్ అయ్యారు. చెన్న అనంతం కరీంనగర్ డిగ్రీ పీజీ కాలేజి ప్రిన్సిపాల్‌గా రిటైరైయ్యారు. చెన్న జగదీశ్వర్ డాక్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు. బొమ్మకంటి రాంగోపాల్ కాంట్రాక్టులు, వ్యాపారాలు, వ్యవసాయం చూసుకుంటూ రిటైరయ్యాడు. ఆరవ తరగతి నుంచి క్లాస్‌మేట్‌గా ఉన్న తుమ్మ గంగాధర్ మోతె నుండి రోజూ నడిచి వస్తుండేవాడు. స్టేట్‌బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేసి రిటైరయ్యాడు.

టి. రాజిరెడ్డి, వాళ్ళ వరుస తమ్ముళ్లు స్వామిరెడ్డి, దామోదర్ రెడ్డి, మా ఇంటిపక్కనే కిరాయికి ఉండేవారు. రాజిరెడ్డి డాక్టర్‌గా చేసి రాయికల్ సర్పంచ్‌గా ఎన్నికై పని చేశారు. బల్వంతాపూర్‌నుండి సదానందరెడ్డి, మధుసూదన్ రెడ్డి, నారాయణరెడ్డి, జగిత్యాలలో క్లాస్‌మేట్లయ్యారు. ఇలా అనేకమంది మల్టీపర్పస్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతిలో క్లాస్‌మేట్లు బ్యాచ్‌మేట్లయ్యారు.

నేను తొమ్మిదో తరగతిలో ఏసిసిలో చేరడం జరిగింది. ఎన్‌సిసి కన్నా ముందు ఎసిసి ఉండేది. ఐదో తరగతి దాకా స్కౌట్ ఉండేది. తొమ్మిదో తరగతిలో ఎసిసిలో చేర్చుకున్నారు. యాక్జిలరీ క్యాడెట్ కార్ప్ అనేది పూర్తి పేరు. శీలం భూపతి సార్ ఎసిసి క్లాస్‌లు తీసుకునేవాడు.

మా ఇంట్లో, మా మేనమామ ఇంట్లో, మా ఇంటి పక్కన, కొక్కుల కొమురయ్య సార్ ఇంట్లో, ఇతర గ్రామాలకు చెందిన విద్యార్థులు కిరాయికి ఉండి వంట చేసుకునేవారు. ఐదారిండ్లల్లో కిరాయికి ఉన్న సహ విద్యార్థులు, నేను క్లాస్‌మేట్స్‌కన్నా ఎక్కువగా స్నేహితులుగా కలిసిమెలిసి ఉండేవాళ్ళం. మేము తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు పదకొండు, పన్నెండు తరగతులు చదివే సీనియర్లు కూడా స్నేహంగా ఉండేవాళ్ళం. వాళ్ళు వయస్సును బట్టి అరే, తొరే అని పిలిచేవారు. దాన్ని ఎప్పటికప్పుడు వేము ఎదిరిస్తూ ఉండేవాళ్ళం. కొంతమంది అరేయ్, తొరేయ్ అని పిలవడం మానేశారు. ఒకరిద్దరు అలాగే కొనసాగించారు. అరేయ్, తొరేయ్ అనే పిలుపు రెండు రకాలు. ఒకటి పెత్తనం చెలాయించడానికి. రెండోది ఆత్మీయత కనబరిచేది.

సీనియర్లు సినిమా పాటలు పాడేవాళ్ళు. 'నా హృదయంలో నిదురించే చెలి, కళలలోన కవ్వించే సఖి' అంటూ పాడేవారు. ఒకోసారి మా ఇంటి పందిరి ఎక్కి పాడేవాళ్ళు. మా పందిరి మీదుగా ఉత్తరాన ప్రహరీగోడ అవతల కొంతమంది టీనేజ్ ఆడబిడ్డలు కనిపించినప్పుడు ఆ పాట మరింత గట్టిగా పాడేవారు. వాళ్ళు చీపురుకట్టలతో కోపంగా చూసేవాళ్ళు. వారు చీపురుకట్ట చూపడం కూడా వీరికి ఆనందంగా ఉండేది. ఆడవాళ్ళు తిట్లు తిట్టినా వీరికి సంతోషం కలిగించడం వింతగా అనిపించేది. వారి బంధువులు 1960-62లోనే అమెరికాలో స్థిరపడ్డారు. అందువల్ల ఆ ఆడపిల్లలకు ఆత్మవిశ్వాసం ఎక్కువ. వారిక్కూడా ఈ పాటలు తమాషాగా ఉండేవేమో.

లక్ష్మీపురం పెద్ద గంగారెడ్డి, రాజిరెడ్డి, చంద్రయ్య, నారాయణ, తిరుమలా పురం చారిలలో ఒకరు పాడుతుంటే మిగితావాళ్ళు ఆసక్తిగా చూస్తుండేవారు. అలా ప్రేమించడంలో ఒక ఉత్తేజం ఉత్పన్నం అయ్యేది. ప్రేమలన్నీ కులాతీతం. పెళ్ళిలన్నీ కులం లోపల జరిగేవి.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

# సిమెంట్ ఇటుకల తయారీకి వాగులను తోడేస్తున్నారు

**నాసిరకం గా సిమెంట్ ఇటుకల తయారీ**

**నాన్యత లేని ఇటుకలు కొని నష్టం పోతున్న వినియోగదారులు**

**అధికారులు స్పందించకుంటే ప్రజలకు, ప్రభుత్వ వనరులకు నష్టం**





జన్నారం రూరర్, ఫిబ్రవరి 18, ప్రజా పాలన: చుట్టూ అటవిప్రాంతం , వాగులలో నుండి, గోదావరి నది నుంచి ఇసుకను తీయవద్దని నిషేధం ఉన్నా అవేవీ పట్టించుకోవడం లేదు సిమెంట్ ఇటుకల తయారీ దారులు. అధికారులను మాముళ్ళతో మచ్చిక చేసుకుని అక్రమ దందాతో అందినంతా సంపాదించుకుంపున్నాలనే విమర్శలు వస్తున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలలో ప్రదాన రహదారి కి అనుకుని సిమెంట్ ఇటుక ప్లాంట్ తయారీ చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేశారు. నిజానికి ప్రభుత్వం గుర్తించిన ఇసుక క్వారీలనుంచి నాన్యమైన ఇసుకను కోనుగోలుచేసి సిమెంట్ ఇపుకలు తయారీ చేయవలసి ఉంది. నిబంధనలు పాటిస్తే ఇసుక కరీదైపోయి అధిక లాభాలు రావని బావించిన సిమెంట్ ఇటుకల తయారీ దారులు స్థానిక వాగులనుండి, కవ్వాల్ రిజర్వఫారెస్టు నుండి, గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణలు తరచూ వస్తున్నాయి.

**నాన్యతకు తిలోదకాలు**

సిమెంటు ఇటుకల తయారీదారులు నాన్యతకు ప్రాదాన్యత ఇవ్వకుండా నాసిరకం ఇసుకతో ఇటుకలు తయారీ చేసి అదికదరలకు విక్రయాలు జరుపుతు న్నారనే విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు అక్రమంగా తరలిస్తున్న ఇసుకను అపేవారు లేక , సిమెంట్ ఇటుకల నాన్యతను పరిక్షించి చర్యలు తీసుకునేవారు కరువై పోవడంతో సిమెంట్ ఇటుకల తయారీ దారుల వ్యాపారం మూడుపువ్వులూ ఆరుకాయలుగా కొనసాగుతుంది.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

ఇప్పటి కైనా ఉన్నతాధికారులు స్పైందిచాలి. ప్రజల కు సరైన దరకు నాన్యమైన సిమెంట్ ఇటుకలు పొందేలా అధికారులు చర్యలు చెపట్టాలి. అదేవిధంగా నిషేదిత ప్రాతాలనుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా అధికారులు అడ్డుకట్ట వేయాలి. ప్రతి సిమెంట్ ఇటుకల తయారీ యూనిట్ ఇసుక ఏక్వారీ నుంచి కొనుగోలు చేస్తున్నారో , సిమెంట్ ఇటుకల నాన్యతకు సంబంధించిన వివరాలు ప్రజలకు తెలిసేలా బోర్డు ఏర్పాటు చేసేవిదంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. నాసిరకం సిమెంట్ ఇటుకల తయారీ ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటారో లేక మాముళ్ళ మత్తులో ఉండి పోతారో వేసిచూద్దాం.

## చిరు వ్యాపారులకు మిని కాంప్లెక్స్ నిర్మించి చిరు వ్యాపారులను ఆదుకోవాలి



మధిర ఫిబ్రవరి 19 ప్రజా పాలన ప్రతినిధి :మధిర మున్సిపాలిటీ పరిధిలో గత నలభై సంవత్సరాల నుండి ప్రధాన రహదారి వెంట చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి సాగిస్తున్నామని అని ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారాలు కూడా అంతంత మాత్రమే ఉన్నాయని ఉన్న చిన్నచిన్న షాపులు శిథిలావస్థకు చేరుకున్నాయని కావున నాయందు దయ ఉంచి చిరు వ్యాపారుల కోసం మినీ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి చిరు వ్యాపారులను ఆదుకోవాలని చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు పసుపులేటి నాగేంద్రశ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జిల్లా కలెక్టర్ గౌతమ్ కు వినతి పత్రం అందజేశారు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న తాసిల్దార్ కార్యాలయం ప్రభుత్వ ఆసుపత్రి మున్సిపాలిటీ కార్యాలయంలో చిరు వ్యాపారుల కోసం మినీ కాంప్లెక్స్ కట్టి అందించాలని చిరు వ్యాపారుల సంఘం కలెక్టర్ గౌతమ్ కోరుతున్నారు వెంటనే స్పందించిన ఆయన ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ ఆలోచన చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో నరసమ్మ సరస్వతి చారి కొండ సూర్యనారాయణబాలు వీరస్వామి బిక్షాలు కృష్ణవేణి ఎం కె చారి . చిరు వ్యాపారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు

# అన్ని దానాల కంటే అన్నదానం మిన్న

**వర్తక సంఘం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దాతల సహకారంతో అన్న గోవిందం**



మధిర ఫిబ్రవరి 19 ప్రజాపాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధిలో శనివారం నాడుఅన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని ఆర్యవైశ్య సంఘం నాయకులు స్వామి సతీష్ కపిలవాయి జగన్ మోహన్ రావు అన్నారు. శనివారం వర్తక సంఘం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద దాతలు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చే విధంగా ప్రతి శనివారం వర్తక సంఘం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమంలో పాల్గొనాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఆడంబరాలకు మితిమీరి ఖర్చులు చేయకుండా పేదల ఆకలి తీర్చే విధంగా అన్నదానాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. అదేవిధంగా బంజారా కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దాతలు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్న దానాన్ని ఆలయ చైర్మన్ గుండెల ముత్తయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాతలు భక్తులు పాల్గొన్నారు.

# పెరిక సంఘం సమావేశానికి హాజరుకండి




**రాష్ట్ర ఉపాధ్యక్షులు అఖి రెడ్డి శంకర్**

బెల్లంపల్లి ఫిబ్రవరి 19 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల్లో ఉన్న పెరిక సంఘం కులస్థులు అందరూ సోమవారం నాడు బెల్లంపల్లి మండలంలోని కాసిరెడ్డి పల్లె కోదండ రామాలయం లో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేయడమైనదని సంఘం సభ్యులు అందరూ సమావేశానికి సకాలంలో హాజరు కావాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకి రెడ్డి శంకర్ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పెరిక ట్రస్ట్ ఏర్పాటు చేయుట, నియోజకవర్గ స్థాయి కమిటీ నియామకము మరియు సంఘం యొక్క భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుట, తదితర అతి ముఖ్యమైన అంశములపై చర్చించడం జరుగుతుందని, కావున సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, అన్ని రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వివిధ రంగాల్లోని ప్రొఫెషనల్స్ , యువకులు అధిక సంఖ్యలో విచ్చేసి వారి వారి అమూల్యమైన సూచనలు, సలహాలు, ఇవ్వవలసిందిగా ఆయన తెలిపారు.

# విద్యారంగాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం

**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్**




ఆసిఫాబాద్ జిల్లా, ఫిబ్రవరి 19 , ప్రజాపాలన, ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యారంగంలో మార్పులు జరుగుతాయని అనుకుంటే ఇంకాస్త సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు సొంత భవనాలు లేకుండా చేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వసతి గృహాలలో సొంత భవనాలు లేక అద్దె భవనాలలో విద్యా అభ్యసిస్తున్నారని అన్నారు. కళాశాల, హాస్టల్స్ కు సొంత భవనాలు లేవని, కనీసం వాటికి స్థలం కేటాయించి, భవనాల మంజూరు చేసే పరిస్థితిలో ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని అన్నారు. ఎస్టీ, ఎస్సీ బీసీ, మైనార్టీ, వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగు నీటి సౌకర్యం, లేదన్నారు. జిల్లాలో అనేక సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్న ప్రభుత్వం, అధికారులు, విద్యార్థులపై చిన్నచూపు చూస్తున్నారన్నారు. విద్యార్థులకు సరైన విద్యా విధానాన్ని అందించాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు. లేనియెడల విద్యార్థులను యువకులను కలుపుకొని ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, జాడి తిరుపతి లు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం పై పాలకుల నిర్లక్ష్యం: రాజలింగు మోతె



మంచిర్యాల బ్యూరో, పిబ్రవరి 19, ప్రజాపాలన. పాలకుల నిర్లక్ష్యం వలన రాష్ట్రంలో ప్రజారోగ్యం ప్రమాదం లో పడిందని రైట్ టు హెల్త్ ఫోరమ్ అధ్యక్షుడు, అడ్వకేట్ రాజలింగు మోతె అన్నారు. శనివారం నస్పూర్ లో ఫోరమ్ నాయకుల ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజలింగు మోతె మాట్లాడారు. ప్రభుత్వాలు పాలకులు మారుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదని అన్నారు. సర్కార్ ఆస్పత్రిలో సరి అయిన వైద్య సిబ్బంది లేకపోవడం వలన ప్రైవేటు కార్పొరేటు ఆస్పత్రులకు పోవాల్సి వస్తుందన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలను ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రులు కాసులకు కక్కుర్తిపడి దోచుకుంటున్నాయన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. సమావేశం అనంతరం జిల్లా ఉపాధ్యక్షులుగా జంగంపెల్లి మహేష్, నస్పూర్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బెడిక సాగర్, రామగిరి రాకేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో పర్లపల్లి శ్రీరామ్, జిలకర శ్రీ వన్, కొల్లూరి సుమంత్, బెడికె సాయి, పుల్లూరు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి



మంచిర్యాల బ్యూరో, పిబ్రవరి 19, ప్రజాపాలన : తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ 395 జయంతిని హైటెక్ సిటీ లో గల తెలంగాణ బీసీ జాగృతి కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ భారతమాత ముద్దుబిడ్డ ధైర్యానికి, దేశభక్తికి , వీరత్వానికి మారుపేరు చత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు. మహిళల కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షులు మడుపు రామ్ ప్రకాష్ , ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్ ,ఉపాధ్యక్షులు మేంత్యాల సంతోష్, వైద్య భాస్కర్ యువ జాగృతి పట్టణ అధ్యక్షులు మంచర్ల సదానందం , కార్యదర్శి డేగ లక్ష్మణ్ , కార్యనిర్వాహణ కార్యదర్శి గుమ్ముల సుదర్శన్, ప్రచార కార్యదర్శి బద్ది శ్రీనివాస్ , సహాయ కార్యదర్శి గార బోయిన శ్రీనివాస్ , సీనియర్ నాయకులు విజయభాస్కర్, చింతకింది తిరుపతి కిరణ్ కుమార్ నార్ల మహేందర్ మామిడాల ప్రకాష్ రాంబాబు , రాజేందర్ పాల్గొన్నారు.

## మెమొంటో అందజేత



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి19( ప్రజా పాలన ప్రతినిధి): మండలంలోని వర్ష కొండ గ్రామంలో మాఘ పౌర్ణమి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న 40మంది విద్యార్థులకు కు మను బ్రాహ్మణ సంఘ సభ్యులు మెమొంటో అందజేశారు ఈ కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు పొనుకంటి చిన్న వెంకటి, గ్రామ ఉపసర్పంచ్ మంగిలిపల్లి లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస రెడ్డి మరియు మండల విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు మదనపల్లి జలంధర్ సభ్యులు శ్రీధర్ నారాయణ సంతోష్ గంగాధర్ నాగేష్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సినిమాస్కోప్

## తండ్రి కోసం దీపిక పదుకోన్ సాహసం



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ తన తండ్రి కోసం భారీ సాహసానికి సిద్ధమవుతోంది. ఏ కూతురు చేయని సరికొత్త ప్రయోగానికి దీపిక ముందుకొస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా పేరుతో పాటు భారీ ఆఫర్లని సొంతంత చేసుకుంటూ నటిగా బిజీగా వున్న ఆమె తన తండ్రి కలని కష్టాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని ప్రయత్నాలు మొదలుపెట్టింది. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం బయోపిక్ ల సీజన్ నడుస్తోంది. ఈ తరహా చిత్రాలకు దేశ వ్యాప్తంగా ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో బయోపిక్ తెరపైకి రాబోతోంది. అదే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకునే తండ్రి ప్రకాష్ పదుకునే బయోపిక్. ఆయన బ్యాడ్మింటన్ ప్లేయర్ అనే విషయం తెలిసిందే. బ్యాడ్మింటన్ ప్లేయర్ ఆయన ఇండియాకు అత్యున్నత గౌరవాన్ని తీసుకురావడమే కాకుండా 1980లో వరల్డ్ నంబర్ వన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ గా రికార్డు ని నెలకొల్పారు. అంతే కాకుండా ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ గెలిచి చరిత్ర సృష్టించారు. ఈ ఫీట్ లు రికార్డులు సాధించడం వెనక ఆయన పడిన కఠోర శ్రమ వుందని ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని భావించిన దీపిక పదుకోన్ తన తండ్రి ప్రకాష్ పదుకోన్ జీవిత కథ ఆధారంగా పారన్ ఇండియా స్థాయిలో ఓ భారీ బయోపిక్ కు శ్రీకారం చుడుతోంది. ఈ విషయాన్ని దీపిక స్వయంగా వెల్లడించింది. నాన్నా ప్రకాష్ పదుకోన్ జీవితం ఎందరికో ఆదర్శం. అందుకే ఆయన బయోపిక్ తీయాలనుకుంటున్నాను%--% అని తెలిపింది. అంతే కాకుండా భారత క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవకముందే మా నాన్నగారు అథ్లెట్ గా దేశ క్రీడా ఖ్యాతిని విశ్వవేదికపై రెప రెపలాడించారు. అథ్లెట్ గా నాన్న సాధన చేయడానికి అప్పట్లో మెరుగైన సౌకర్యాలు ఉండేవి కావు. పెళ్లి మండపాల్లో సాధన చేసేవారు. తన బలహీనలను బాలాలుగా మార్చుకునేందుకు నిరంతరం కృషిచేశారు. ఆయన జీవితం చాలా మందికి స్ఫూర్తి దాయకం. అందుకు ఆయన బయోపిక్ ని నిర్మించాలని ప్రయత్నాలు మొదలుపెట్టానని తెలిపింది దీపిక. అయితే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని మాత్రం వెల్లడించలేదు.

## ఐదు ప్రాజెక్టులను లైన్లో పెట్టేసిన అక్కినేని హీరో!

కరోనా ప్రభావం నుంచి ఇండస్ట్రీ తేరుకుంటోంది. ఈ సమయంలో లైన్లో పెట్టిన కథలను పట్టాలెక్కించడంలో హీరోలంతా బిజీగా ఉన్నారు. యువ హీరోలంతా వరుస ప్రాజెక్టులను సెట్ చేసుకుని మిగతావారికి గట్టి పోటీని ఇవ్వడానికి రెడీ అవుతున్నారు. సాధారణంగా చైతూ నిదానమే ప్రధానమన్నట్టుగా ఉంటాడు. ఒక సినిమా తరువాతనే మరో సినిమాను చేయడానికి ఇష్టపడుతుంటాడు. కానీ ఇకపై కూడా అలా ఉంటే కలవదు .. కుదరదు. అందువల్లనే ఇక స్పీడ్ పెంచే పనిలో పడ్డాడు. 'లవ్ స్టోరీ' .. 'బంగార్రాజు' సినిమాలతో హిట్ కొట్టేసిన చైతూ త్వరలో 'థ్యాంక్యూ' సినిమాతో పలకరించనున్నాడు. విక్రమ్ కుమార్ మంచి డైరెక్టర్ .. ఆయన సినిమాలు మిగతా సినిమాలకు చాలా భిన్నంగా ఉంటాయి. ఆయన ఎంచుకునే కథలు .. తెరపై వాటిని చెప్పే తీరు కొత్తగా ఉంటాయి. అందువలన ఈ సినిమా కోసం చాలా మంది ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ముగింపు దశగా ఈ సినిమాను పరుగులు తీయిస్తూనే ఐదు ప్రాజెక్టులను చైతూ లైన్లో పెట్టేశాడు. ఈ మధ్య కాలంలో వచ్చిన వైవిధ్యభరితమైన చిత్రాలలో



ఒకటిగా 'నాంది' కనిపిస్తుంది. చాలా గ్యాప్ తరువాత 'అల్లరి' నరేశ్ కి హిట్ ఇచ్చిన సినిమా ఇది. ఈ సినిమాకి దర్శకత్వం వహించిన విజయ్ కనకమేడలతో చైతూ ఒక సినిమా చేయనున్నాడు. ఇక ఒక కథను ఎక్కడా బోర్ కొట్టకుండా పరుగులు తీయించే దర్శకురాలిగా నందినీ రెడ్డి కనిపిస్తుంది. గతంలో సమంతతో ఆమె చేసిన 'ఓ బేబీ'లో చివర్లో చైతూ ఒకసారి అలా మెరిశాడు. అలాంటి ఆమె దర్శకత్వంలో ఒక రొమాంటిక్ ఎంటర్టైనర్ చేయడానికి చైతూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ఎనౌన్స్ మెంట్ త్వరలో రానుంది.

ఇక లవ్ .. ఫ్యామిలీ ఎమోషన్స్ ను సమపాళ్లలో మిక్స్ చేసి ఇటు యూత్ ను .. అటు ఫ్యామిలీ ఆడియన్స్ ను మెప్పించిన కిశోర్ తిరుమలకి కూడా చైతూ ఓకే చెప్పేశాడు. తాజాగా కిశోర్ తిరుమల ఈ విషయాన్ని ధృవీకరించ చాడు కూడా. డీవీవీ దానయ్య నిర్మాణంలో .. భారీ బడ్జెట్ తో ఈ సినిమా రూపొందనుండటం విశేషం. ఇంతవరకూ లవ్ .. యాక్షన్ .. ఎమోషన్ కి సంబంధించిన కథలను చేస్తూ వచ్చిన చైతూ ఫస్టు టైమ్ తన కెరియర్లో 'టైమ్ ట్రావెల్'కి సంబంధించిన సినిమా చేయనున్నాడు. ఈ సినిమాకి రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహించనున్నాడు. రీసెంట్ గా ఆయన 'శ్యామ్ సింగ రాయ్'తో తన సత్తా చాటుకున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ వారు ఈ సినిమాను భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది తన కెరియర్లోనే ప్రత్యేకమైన సినిమాగా నిలుస్తుందని చైతూ భావిస్తున్నాడు. తాజాగా సురేశ్ ప్రొడక్షన్స్ లో ఒక సినిమా చేయడానికి కూడా చైతూ ఓకే చెప్పినట్టుగా తెలుస్తోంది. ఇటీవల తమిళంలో హిట్ కొట్టిన 'మానాడు' సినిమాకి ఇది రీమేక్. అక్కడ శింబు హీరోగా చేయగా ఆ పాత్ర కోసం ఇక్కడ చైతూను తీసుకున్నారు. ఆయన సరసన నాయికగా పూజ హెగ్డే ఎంపిక జరిగినట్టుగా చెప్పుకుంటున్నారు. మంచి బలమైన కంటెంట్ ఉన్న సినిమా కావడం వలన ఈ ప్రాజక్ట్ గురించి ఆలోచించవలసిన పనిలేదు. మరో వైపున పరశురామ్ తో అనుకున్న సబ్జెక్టు కూడా రెడీగానే ఉంది. ఇక్కడి నుంచే 'సర్కారువారి పాట'కు వెళ్లిన పరశురామ్ తిరిగి వచ్చిన తరువాత మళ్లీ దీనిని మొదలెట్టే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి ఈ ఏడాది మాత్రమే కాదు వచ్చే ఏడాది కూడా చైతూ బిజీనే!

## ఆడవాళ్ళు.. ఓ వారం వెనక్కి వెళ్తున్నారా..?


శర్వానంద్ – రష్మిక మందన్న జంటగా నటించిన ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ "ఆడవాళ్ళు మీకు జోహార్లు". తిరుమల కిషోర్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని ఫిబ్రవరి 25న ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. అయితే ఇప్పుడు 'ఆడవాళ్లు..' సినిమా ఓ వారం వెనక్కి వెళ్లే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. 'భీమ్లా నాయక్' మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో టాలీవుడ్ లో మిగతా విడుదలలో గందరగోళం ఏర్పడింది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 25న లేదా ఏప్రిల్ 1న విడుదల చేస్తామని మేకర్స్ ముందుగానే ప్రకటించారు. అయితే పవన్ సినిమా విడుదలపై సందేహాలు ఉండటంతో శర్వానంద్ సినిమా కోసం ఈ నెల 25ని లాక్ చేశారు. కానీ ఇప్పుడు 'భీమ్లా నాయక్' చిత్రాన్ని వచ్చే వారం భారీగా స్థాయిలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేసారు. దీంతో అదే రోజు వారాలనుకున్న ఇతర సినిమాలు వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో "ఆడవాళ్ల మీకు జోహార్లు" చిత్రాన్ని మార్చి 3వ తేదీకి షిఫ్ట్ చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. అలానే ఏప్రిల్ 8 అని మరో డేట్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే శర్వా




టీమ్ మాత్రం ఇంకా అదే డేట్ మీద ప్రమోషన్స్ చేస్తున్నారు. ఈరోజు ఒక సాంగ్ ని రిలీజ్ చేయడంతో పాటుగా రేపు గ్రాండ్ గా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చేయడానికి రెడీ అవుతున్నారు. మరి ఈ రెండు రోజుల్లో విడుదల తేదీ మీద అధికారిక ప్రకటన ఇస్తారేమో చూడాలి. 'ఆడవాళ్ళు మీకు జోహార్లు' సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ ని క్రియేట్ చేసింది. దర్శకుడు కిషోర్ తిరుమల అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందించారని తెలుస్తోంది. గత కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న శర్వానంద్ ఈ సినిమాపై ఆశలు పెట్టుకున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

## అవైటెడ్ "భీమ్లా నాయక్" ట్రైలర్ కి డేట్ ఫిక్స్..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరియు రానా దగ్గుబాటిలు హీరోలుగా నటించిన లేటెస్ట్ అండ్ మోస్ట్ అవైటెడ్ చిత్రం "భీమ్లా నాయక్" కోసం అందరికీ తెలిసిందే. గత మూడు రోజులు నుంచి అయితే ఓ రేంజ్ లో హైప్ తెచ్చుకున్న ఈ చిత్రం భారీ అంచనాలు అంతకంతకు పెంచుకుంటూ వెళుతుంది. మరి ఈ గ్యాప్ లో అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న బిగ్గెస్ట్ అప్డేట్ ఈ సినిమా ట్రైలర్ కోసం.. చాలా అవైటెడ్ ట్రైలర్ గా మారిన ఈ సినిమా ట్రైలర్ పై మేకర్స్ ఇప్పుడు బ్లాస్టింగ్ అప్డేట్ ని ఇచ్చారు. ఈ సినిమా ట్రైలర్ ని ఈ సినిమా ప్రీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేసిన ఫిబ్రవరి 21 నే ట్రైలర్ ని కూడా రిలీజ్ చేస్తున్నట్టు ఇప్పుడు కన్ఫర్మ్ చేశారు. టైం అయితే ఇంకా చెప్పలేదు కానీ డేట్ అయితే ఇప్పుడు వచ్చేసింది.. సో ఈ ట్రైలర్ తో మాసివ్ రికార్డ్స్ నెలకొల్పడం గ్యారెంటీ అని చెప్పాలి.





"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్



BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది


అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్


## పవన్ సినిమాకు ప్రముఖ ఓటీటీల క్రేజీ ఆఫర్




స్టార్ హీరోల చిత్రాలకు ప్రీ రిలీజ్ బిజినెస్ రికార్డు స్థాయిలో జరుగుతున్న విషయం తెలిసిందే. ఇటీవల టాలీవుడ్ సినిమాల మార్కెట్ స్థాయి పెరగడంతో ప్రతీ సినిమా బిజినెస్ పరంగా హాట్ కేక్ లా మారిపోతోంది. బిజినెస్ పరంగా శాటిలైట్ డిజిటల్ హక్కుల పరంగా సంచలనాలు సృష్టిస్తోంది. స్టార్ సినిమా రిలీజ్ కు రెడీ అయిందంటే చాలు థియేట్రికల్ హక్కుల దగ్గరి నుంటి డిజిటల్ హక్కుల వరకు భారీ పోటీ నెలకొంటోంది. ఎంత పోటీ వున్నా.. మేకర్స్ ఎంత భారీగా కోట్ చేసినా ఓటీటీ దిగ్గజాలు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. భారీగా పెట్టి సినిమాల్ని దక్కించుకుంటూ సంచలనం సృష్టిస్తున్నాయి. అంతే కాకుండా పెద్ద సినిమాల కోసం ఒకటి రెండు ఓటీటీ దగ్గజాలు కలిసి షేరింగ్ పంథాలో దక్కించుకుంటున్నాయి. ఇదే తరహాలో ఆహా ఓటీటీ డిస్నీప్లస్ హాట్ స్టార్ కలిపి సొంతం చేసుకున్నాయట. ఇందు కోసం భీమ్లా నాయక్ మేకర్స్ కి రికార్డు ప్రైజ్ ని ఆఫర్ చేసినట్టుగా తెలుస్తోంది. డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఓటీటీ కి దేశ వ్యాప్తంగా మంచి క్రేజ్ వున్న విషయం తెలిసిందే. అలాంటి సంస్థ తో కలిసి ఆహా భీమ్లా నాయక్ స్ట్రీమింగ్ హక్కుల్ని దక్కించుకుందని చెబుతున్నారు. ఈ సినిమాతో ఆహాని మరింత మందికి రీచ్ చేయాలని భావిస్తున్నారట. గత కొంత కాలంగా ఆహా ఓటీటీని మరింత పాపురల్ చేయాలని నిర్వాహకులు ప్లాన్ లు చేస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల తమిళంలోనూ దీన్ని లాంఛ్ చేసి భారీ ఈవెంట్ ని నిర్వహించారు. మిగతా పాపులర్ ఓటీటీల తరహాలో ఆహాని ప్రతీ ఇంటికి చేరువ చేయాలంటే క్రేజీ స్టార్ సినిమా కావాలని భావించిన ఆహా వర్గాలు ఇందు కోసం భీమ్లా నాయక్ ని ఎంచుకున్నట్టు గా చెబుతున్నారు. ఇప్పటికే మాస్ మహారాజా రవితేజ నటించిన క్రాక్ నాగచైతన్య నటించిన లవ్ స్టోరీ అఖిల్ అక్కినేని పూజా హెగ్డే నటించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రాల స్ట్రీమింగ్ హక్కుల్ని సొంతం చేసుకున్నారు. ఆహా ఇప్పటి వరకు స్ట్రీమింగ్ హక్కుల్ని దక్కించుకున్న పెద్ద సినిమా క్రాక్ మాత్రమే. ఇప్పుడే భీమ్లా నాయక్‌తో డేరింగ్ స్టెప్ వేయబోతోంది. కారణం ఈ సినిమాకున్న క్రేజ్ అలాంటిది. దీనిని అడ్డం పెట్టుకుని ఆహా ఓటీటీని వరల్డ్ వైడ్ గా వున్న తెలుగు వాళ్లందరికీ రీచ్ కావాలని ప్లాన్ చేస్తోందట. ఆ కారణంగానే డిస్నీ ప్లస్ హాట్ స్టార్ తో కలిసి ఆహా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన క్రేజీ చిత్ర స్ట్రీమింగ్ హక్కుల్ని దక్కించుకుందని ఇండస్ట్రీ వర్గాల్లో ఓ వార్త వైరల్ గా వినిపిస్తోంది. రిలీజ్ కు ముందు సంచలనం సృష్టిస్తున్న ఈ మూవీ ఈ నెల 25న ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 25న ఐదు భాషల్లో విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ని ఈ నెల 21న సోమవారం అత్యంత భారీ స్థాయిలో నిర్వహించబోతున్నారు.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989